




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 163 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా శుక్రవారం 24 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE : 163 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, FRI 24 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


### అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం..

## బెంగాల్‌ను విముక్తం చేయండి

- హుగ్లీ జిల్లా బాలాగర్ లో అమిత్ షా బహిరంగసభ
- బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం రాగానే అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తామన్న అమిత్ షా
- మే 5వ తేదీతో మమతా బెనర్జీ పాలన ముగుస్తుందని ధీమా



**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుగ్లీ జిల్లా బాలాగర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భద్రత, ఆర్థిక వ్యవస్థపై అక్రమ వలసల ప్రభావాన్ని ఎండగట్టారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాగానే ఒక్కరిని కూడా

- మిగతా 2లో



## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

### బ్యాంకులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

- సైబర్ మోసాల కట్టడిపై బ్యాంకులతో హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉన్నతస్థాయి సమావేశం
- 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని బ్యాంకులకు ఆదేశం
- అకౌంట్ల సంఖ్య కన్నా పౌర భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- మోసాలకు సహకరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిక
- విదేశాల కేంద్రంగా సైబర్ మోసాలు.. బ్యాంకు అధికారుల పాత్రపై సీపీ ఆందోళన

2లో

### తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్...

## రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు



- సాయంత్రం 5 గంటలకే తమిళనాడులో 82.24%, బెంగాల్‌లో 89.93% ఓటింగ్
- కన్యాకుమారిలో పడవల్లో డ్యామ్ దాటి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు
- 2021 ఎన్నికల నాటి పోలింగ్ శాతాన్ని అధిగమించిన రెండు రాష్ట్రాలు
- డీఎంకే కూటమి 200కు పైగా సీట్లు గెలుస్తుందని ఎండీఎంకే నేత వైగో ధీమా

- మిగతా 2లో

### జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన

## ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు
- మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందించడమే కారణం
- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం
- సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠిన చర్యలని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా, పులివెందులలో మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి ఆయనకు వేదాశీర్వచనం అందించినందుకు గాను వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో ఉన్న


- మిగతా 2లో

# హరిత, నీలి నగరంగా

# అమరావతిని నిర్మిస్తాం

- అమరావతి పనులకు మళ్లీ ఊపు.. కీలక నిర్ణయాలు తీసుకున్న చంద్రబాబు
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు ఆదేశం
- ఏపీలో మళ్లీ పెట్టుబడులపై విశ్వాసం పెరిగిందన్న ముఖ్యమంత్రి
- ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో అమరావతి విద్యా కేంద్రంగా మారుతుందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురపాలక, సీఆర్డీఏ, ఆర్థిక, అటవీ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించారు. అమరావతిని ప్రపంచంలోనే ఓ అత్యుత్తమ హరిత, నీలి (గ్రీన్ అండ్ బ్లూ) నగరంగా, నివాసయోగ్యమైన (లివబుల్) నగరంగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలకు అమరావతి నగరం నిలయంగా మారుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. బిట్స్ పిలాని వంటి క్యాంపస్‌ల ఏర్పాటుతో ఇది కీలకమైన విద్యా కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు మళ్లీ విశ్వాసం కలిగిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే రెన్యూ ఎనర్జీ వంటి సంస్థలు ఇంగాట్ సోలార్ వేఫర్ ఉత్పత్తి కోసం అనకాపల్లిలో యూనిట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజధాని నగరాన్ని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై నిర్మించే వంతెనను అత్యంత ఆకర్షణీయంగా, ఓ ఐకానిక్ నిర్మాణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.




### పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు..

## కేంద్రం కీలక ప్రకటన

- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం
- ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశపూర్వకమని వెల్లడి
- గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నా భారత్‌లో స్థిరంగానే రేట్లు

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది.

- మిగతా 2లో







### అనకాపల్లిని మరో రంగారెడ్డి

## జిల్లాగా తీర్చిదిద్దుతాం

- రాంబిల్లిలో రూ.5,400 కోట్లతో రెన్యూ సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యమని వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ ధ్వంసమైందని విమర్శ
- విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ

- మిగతా 2లో

### జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి చైర్మన్

- ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరణ
- నిర్ణయం తీసుకున్న మండలి చైర్మన్ మోషేన్ రాజు
- రాజీనామాపై హైకోర్టు ఆదేశాలతో నిర్ణయం వెల్లడి
- సమాధానం సంతృప్తికరంగా లేదన్న చైర్మన్
- యథాతథంగా కొనసాగనున్న జయమంగళ ఎమ్మెల్సీ పదవి

- మిగతా 2లో



### తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

- తెలంగాణలోని అన్ని పాఠశాలలకు నేటి నుంచి 50 రోజుల పాటు వేసవి సెలవులు
- సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న తిరిగి ప్రారంభంకానున్న పాఠశాలలు

- మిగతా 2లో



### అనంతబాబుకు సమాచారం అందించినట్టు ఆరోపణలు.. సీఐపై వేటు

- డ్రైవర్ హత్య కేసులో ఏ1గా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు
- కేసు దర్యాప్తు సమాచారాన్ని ఆయనకు అందించినట్లు సీఐ రవికుమార్ పై ఆరోపణలు
- వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### హార్మూజ్ జలసంధిలో 'డిజిటల్' బాంబు.. ఇరాన్ తదుపరి టార్గెట్ డేటా కేబుల్స్..?

ఒకప్పుడు యుద్ధాలు కేవలం సరిహద్దుల్లో ఆయుధాలతో జరిగేవి.. కానీ ఇప్పుడు 'డిజిటల్' రూపం సంతరించుకున్నాయి. చమురు సరఫరా అడ్డుకోవడం ద్వారా ప్రపంచాన్ని వణికించిన ఇరాన్, ఇప్పుడు 'సముద్రగర్భ డేటా కేబుల్స్'పై దృష్టి సారించిందన్న వార్త ఆధునిక ప్రపంచానికి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. చమురు లేకపోతే బండ్లు ఆగుతాయి, కానీ డేటా లేకపోతే దేశాలే ఆగిపోతాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఫిజికల్ వార్ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వార్‌గా మారుతుంది. హార్మూజ్ జలసంధి కేవలం నౌకలు వెళ్లే దారి మాత్రమే కాదు, అది ప్రపంచాన్ని కలిపే డిజిటల్ హైవే కూడా. ఇరాన్ మీడియా నుంచి అందుతున్న సంకేతాల ప్రకారం.., అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను దెబ్బతీయడానికి ఇరాన్ ఇప్పుడు 'సముద్రగర్భ కేబుల్స్'ను ఆయుధంగా వాడుకోవాలని చూస్తోంది. ఇది జరిగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించని విపత్తును ఎదుర్కోవాల్సి ఉంటుంది.

మనకు ఇంటర్నెట్ శాటిలైట్ల ద్వారా వస్తుందని చాలా మంది అనుకుంటారు. కానీ వాస్తవానికి 95 శాతానికి పైగా అంతర్జాతీయ డేటా ట్రాఫిక్ సముద్రం అడుగున ఉండే కేబుల్స్ ద్వారానే సాగుతుంది. గల్ఫ్ దేశాలను యూరప్, ఆసియాతో కలిపే అనేక ప్రధాన కేబుల్ వ్యవస్థలు హార్మూజ్ జలసంధి గుండా వెళ్తాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీలు, క్లౌడ్ డేటా స్టోరేజ్, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వాల మధ్య కమ్యూనికేషన్ అంతా ఈ కేబుల్స్ పైనే ఆధారపడి ఉంటుంది.

**అసలు వ్యూహం ఇదేనా?**

చమురు ట్యాంకర్లను అడ్డుకోవడం వల్ల ఇరాన్ ఇప్పటికే ప్రపంచ దేశాల ఆగ్రహానికి గురైంది. ఇప్పుడు డేటా కేబుల్స్ ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మరింత ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది. ఈ కేబుల్స్ సముద్రం అడుగున కొన్ని అడుగుల లోతులో ఉంటాయి. ఒక చిన్న లంగరు ద్వారా లేదా ఉద్దేశపూర్వకంగా సబ్‌మెరైన్లతో వీటిని కట్ చేయడం చాలా సులభం. ప్రధాన కేబుల్స్ దెబ్బతింటే, పెర్షియన్ గల్ఫ్ దేశాల్లో ఇంటర్నెట్ పూర్తిగా స్తంభించిపోతుంది. బ్యాంకింగ్ సర్వీసులు ఆగిపోయి, ప్రజలు నగదు విత్‌డ్రా చేసుకోలేక, ఆన్‌లైన్ పేమెంట్స్ చేయలేక గందరగోళం నెలకొంటుంది.

ఇరాన్ గనుక ఈ డేటా యుద్ధానికి దిగితే, అది కేవలం అమెరికా-ఇజ్రాయెల్ దేశాలనే కాదు, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. ఆధునిక ప్రపంచం ఎంతగా టెక్నాలజీపై ఆధారపడి ఉందో, ఆ టెక్నాలజీ ఎంత సులభంగా దెబ్బతినవచ్చో ఈ పరిణామం హెచ్చరిస్తోంది. చమురు సరఫరాను పునరుద్ధరించడానికి ఆరు నెలలు పడుతుందని పెంటగాన్ చెబుతున్న తరుణంలో.. డేటా కేబుల్స్ కు నష్టం జరిగితే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించుకోవడమే కష్టం.

# అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతాం

భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఈ జిల్లా పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గతంలో వెనుకబడిన రంగారెడ్డి జిల్లా ఎలాగైతే సంపన్న ప్రాంతంగా మారిందో, విశాఖకు సమీపంలో ఉన్న అనకాపల్లిని కూడా మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ సోలార్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 6.5 గిగావాట్ల ఇన్‌గాట్-వేఫర్ తయారీ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధిపై తన ప్రభుత్వ దార్శనికతను ఆవిష్కరించారు.

**పెట్టుబడులతో పునర్నిర్మాణం**

గత ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాలన్న ఏకైక లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు రెన్యూ ఎనర్జీ సంస్థ భారీ పెట్టుబడితో ముందుకు రావడం శు భపరిణామమన్నారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు

జయంత్ సిన్హా వేగంగా అభివృద్ధి చెందుతున్న సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం రాష్ట్రంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, రాంబిల్లిలో సోలార్ ఫలకాల తయారీ పరిశ్రమ రావడం ద్వారా రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

**గ్రీన్ ఎనర్జీయే లక్ష్యం**

రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ రంగంలో రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. 90 గిగావాట్ల మేర ప్రతిపాదనలు, ఒప్పందాలు (ఎంఓయూలు) సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఒక్క ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ సంస్థే రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోందన్నారు.

అభివృద్ధికి విద్యుత్ వినియోగం ఒక సూచిక అని, అందుకే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వివరించారు. దీనిలో భాగంగా పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, ఆర్టీసీ కూడా 1,050 గ్రీన్ బస్సులను ప్రవేశపెడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని చంద్రబాబు ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) రద్దు చేయడం, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వంటి చర్యలతో రాష్ట్రం తీవ్రంగా

నష్టపోయిందన్నారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని మోపి 'ట్రూ అప్' ఛార్జీల రూపంలో వసూలు చేశారని విమర్శించారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తమ ప్రభుత్వం ప్రారంభించిన విద్యుత్ సంస్కరణల ఫలాలను ప్రజలకు అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 23) విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి.

**సమ్మర్ హాలిడేస్ షెడ్యూల్:**

ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి.

జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి.

సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

# జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి చైర్మన్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమర్పించిన రాజీనామాను శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవి యథాతథంగా కొనసాగనుంది. వివరాల్లోకి వెళితే, 2024 నవంబరులో జయమంగళ వెంకటరమణ వైసీపీకి, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, తన రాజీనామాను ఛైర్మన్ ఉద్దేశపూర్వకంగా ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన గత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, జయమంగళ రాజీనామాపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది సైతం హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఛైర్మన్ మోషేన్ రాజు, జయమంగళ రాజీనామాను తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజీనామాకు జయమంగళ సమర్పించిన సమాధానం సంతృప్తికరంగా లేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల తర్వాత చోటుచేసుకున్న ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజీనామా తిరస్కరణకు గురవడంతో చట్టప్రకారం జయమంగళ ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. కాగా, అప్పట్లో వైసీపీకి రాజీనామా చేసిన జయమంగళ వెంకటరమణ... పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

# తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్... రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు.

ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం, సాయంత్రం 5 గంటలకే పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం, తమిళనాడులో 82.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే), తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. చెన్నైలో పోలింగ్ చివరి గంటలో, ఓటర్లు తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఏఐఏడీఎంకే అభ్యర్థి డి. జయకుమార్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని

152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.

ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ... "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్-ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు. కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

# అనంతబాబుకు సమాచారం అందించినట్లు ఆరోపణలు.. సీఐపై వేటు

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు పోలీసుల అంతర్గత సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో సర్పవరం సీఐ రవికుమార్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన రహస్య సమాచారాన్ని, పోలీసుల కదలికలను సీఐ రవికుమార్ ఎప్పటికప్పుడు అనంతబాబుకు చేరవేస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దర్యాప్తు పారదర్శకతను దెబ్బతీస్తూ నిందితుడికి సహకరించినందుకు గాను, ఏలూరు రేంజ్ ఐజీ ఆయనను తక్షణమే విధుల్లో నుంచి తప్పించి, వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

# అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం.. బెంగాల్‌ను విముక్తం చేయండి

- మొదటి పేజి తరువాయి

అక్రమంగా సరిహద్దు దాటి రానివ్వబోమని, ఇప్పటికే ఉన్న వారిని గుర్తించి పంపించివేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు దక్కాల్సిన రేషన్, ఉద్యోగాలను ఈ అక్రమ వలసదారులు లాగేసుకుంటున్నారని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఆటంకమని ఆరోపించారు. మీరు వేసే ఓటు కేవలం ఒక ఎమ్మెల్యే కోసమే కాదని, అక్రమ చొరబాటుదారుల నుంచి బెంగాల్ విముక్తి కోసం కూడా అని పేర్కొన్నారు. మే 5వ తేదీతో 'దీదీ' పాలన ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నేడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి తొలి దశ (152 స్థానాలు) పోలింగ్ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికే దాదాపు 89 శాతానికి పైగా భారీ ఓటింగ్ నమోదైంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

# జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఈ ఆలయంలో పనిచేసే అర్చకులు ప్రొటోకాల్‌ను అతిక్రమించడంపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. వ్యక్తిగత హోదాలో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి ఆలయ మర్యాదలను పాటించకపోవడం సరికాదని భావించింది. ఈ నేపథ్యంలోనే సదరు అర్చకులపై చర్యలకు ఉపక్రమించింది. అర్చకులకు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో రెండు రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని టీటీడీ స్పష్టం చేసింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆలయ పవిత్రత, నియమ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీటీడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ నోటీసులపై అర్చకుల నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. వారి వివరణ అందిన తర్వాత టీటీడీ తదుపరి చర్యలు తీసుకోనుంది.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు.. కేంద్రం కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది. ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

**దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా**

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద ఘంటికలు

# అప్రమత్తంచేసిన ఎమ్మెల్సీపి.చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 23. ఉద్యోగుల బ్లాక్ మెయిలింగ్‌కు దిగిన కూటమి ప్రభుత్వం అందుకే హిమాచల్ తరహాలో జీతాలు తగ్గిస్తామని లీకులు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఫైర్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గత ఎన్నికల్లో ఉద్యోగులకు అలవి కాని హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేయలేక అవస్థలు తప్పించుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎత్తుగడలు అందుకే ఎల్లో మీడియాలో బ్లాక్ మెయిలింగ్ కథనాలు ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి ఏపీలో ఉద్యోగులపై కూటమి సర్కార్ భారీ కుట్ర ఏపీకి, హిమాచల్‌ప్రదేశ్ ఆర్థిక పరిస్థితికీ పోలికేంటి హిమాచల్ తరహాలో ఉద్యోగుల జీతాలు తగ్గిస్తారా హామీలు అమలు చేయకపోగా బ్లాక్ మెయిలింగా సూటిగా ప్రశ్నించిన పి.చంద్రశేఖర్‌రెడ్డి ఎన్ని కష్టాలున్నా ఉద్యోగులకు మేం ఐఆర్ ఇచ్చాం కోవిడ్ లోనూ ఠంచనుగా ఒకటో తేదీ జీతాలిచ్చాం పీఆర్సీ కమిషనర్ ను నియమిస్తే రాజీనామా చేయించారు మూడేళ్లవుతున్నా కొత్త పీఆర్సీ వేయకుండా మీనమేషాలు

ఇప్పుడు ఉద్యోగులు ఐఆర్, పీఆర్సీ అడక్కుండా తప్పుడు రాతలు

:ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి ఆక్షేపణ గత ఎన్నికల్లో ఉద్యోగులకు అలవికాని హామీలిచ్చి, వాటిని అమలు చేయకుండా రెండేళ్లు కాలం గడిపేసిన కూటమి సర్కార్.. ఇప్పుడు వారు అవేవీ అడక్కుండా హిమాచల్ ప్రదేశ్ లా జీతాలు తగ్గిస్తామని ఎల్లో మీడియాలో లీకులు ఇవ్వడం దారుణమని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మండిపడ్డారు. గతంలో వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే తొలి కేబినెట్లోనే ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ ప్రకటిస్తే.. ఇప్పుడు కూటమి సర్కార్ ఎన్నికల హామీలు నిలబెట్టుకపోగా, మూడేళ్లయినా పీఆర్సీ కమిషన్ ను సైతం నియమించకుండా మోసం చేస్తోందన్నారు. ఉద్యోగులు అవన్నీ అడుగుతారనే వాళ్లను బ్లాక్ మెయిలింగ్ చేసేందుకు హిమాచల్ ప్రదేశ్ కథల్ని తెరపైకి తెస్తున్నారని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆక్షేపించారు.

ప్రెస్ మీట్ లో పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇంకేమన్నారంటే.అలవి కాని హామీలిచ్చి ఇప్పుడు యూటర్న్:2024 ఎన్నికలకు ముందు ప్రభుత్వ ఉద్యోగుల్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎంతో రెచ్చగొట్టారు. మా ప్రభుత్వం గనుక వస్తే మీకు ఎంతో మేలు చేస్తామని, మీకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలన్నీ ఇచ్చేస్తామని మోసపూరిత మాటలు చెప్పారు. కానీ ప్రభుత్వంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా దారుణంగా మోసం చేస్తున్నారు. నిన్న ఎల్లో మీడియాలో కథనాలు చూస్తే ప్రభుత్వ ఉద్యోగులు ఉలిక్కి పడేలా ఉంది. చంద్రబాబు ఏదైనా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవాలనుకున్నప్పుడు తన అనుకూల పత్రికల ద్వారా లీక్ ఇస్తారు. ఆ తర్వాత వాటిని అమలు చేస్తారు. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో కూడా అదే చేస్తున్నారు. వారికి ఇక నుంచి ఏమీ ఇవ్వబోమన్న సంకేతాలు తన అనుకూల మీడియాలో లీక్‌ల ద్వారా చెప్పారు.

ఇప్పుడు హిమాచల్ తరహాలో జీతాలు తగ్గిస్తామని లీకులు నిన్న (గురువారం) ఎల్లో మీడియాలో ఆంధ్రప్రదేశ్‌ను హిమాచల్‌ప్రదేశ్‌తో పోలుస్తూ ఓ కథనం వండి వార్చారు. ఇందులో 'ఖర్చుల నియంత్రణ కోసం జీతాలు తగ్గించిన హిమాచల్ ప్రదేశ్.. ఆర్థికంగా మనమూ (ఆంధ్రప్రదేశ్) కూడా అంతంతే. జీతాలు, పెన్షన్ల



వ్యయం ఏపీలో అత్యధికంగా ఉంది.. ఇలాగైతే మనదీ హిమాచల్ ప్రదేశ్ లాగానే.. రాష్ట్ర సొంత ఆదాయంలో జీతాలు, పెన్షన్లదే అగ్రవాటా.. ఆర్థిక పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ ఆదాయం ఉద్యోగుల జీతాలకు కూడా సరిపోదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.. ఇప్పటికే రూ.70 వేల కోట్లు జీతభత్యాలకు ఖర్చవుతోందని రాశారు. అందుకే రాబోయే రోజుల్లో హిమాచల్‌ప్రదేశ్ తరహాలో ఇక్కడ కూడా జీతాలు తగ్గించే అవకాశం ఉందని చెప్పకనే చెప్పారు.జగన్ హయాంలో కష్టాలున్నా 27 శాతం ఐఆర్ ఇచ్చాం:

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాగానే మొట్టమొదటి కేబినెట్లోనే ఐఆర్ 27 శాతం వెంటనే ఇచ్చి అమలు చేశాం. కోవిడ్ సమయంలో రెండేళ్లు కష్టాలున్నా ఒకటో తేదీ ఠంచనుగా జీతాలు ఇచ్చాం. అన్ని కష్టాలు ఉన్నా 3 శాతం పీఆర్సీ ఇచ్చాం. ప్రతీ విభాగంలోనూ ప్రమోషన్లు ఇచ్చాం. అంతకు మించి కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందని ఉద్యోగులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయింది. అయినా ఇప్పటికీ ఉద్యోగులకు ఏ ఒక్క మేలూ జరగలేదు. బీజేపీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి ఇచ్చిన మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేస్తారని అందరూ ఆశించారు. ఓ మ్యానిఫెస్టో ఇచ్చి ప్రజలకు వైఎస్సార్సీపీ నమ్మకం కలిగించిన తర్వాత టీడీపీ కూటమ...

# పెన్ పవర్

## రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# చిన్నారులకి ఫోన్లు ఇవ్వద్దు సూపర్వైజర్ పద్మావతి

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 23. బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల ఎస్టీ కాలనీలో అంగన్వాడి పాఠశాలలో అంగన్వాడి కార్యకర్త భారతి ఆధ్వర్యంలో 8 వ పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి పాల్గొని గర్భిణీలకు పలు సూచనలు చేశారు. గర్భిణీలు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ పద్మావతి మాట్లాడుతూ గర్భిణీలు పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బాలింతలపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాలింతలకు తల్లిపాల తో పాటు పోషకాహారాలు ఉండే ఆహారాన్ని తినిపించాలన్నారు. చిన్నారులకు ఫోన్లో ఇవ్వద్దని



సూచించమన్నారు. ఈనెల 23 వరకు పోషణ పక్వాడ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అనిలమ్మ, అనిత గర్భిణీలు పాల్గొన్నారు.

# కోవూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆకస్మిక తనిఖీ





కోవూరు పెన్ పవర్ ఏప్రిల్ 23. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభం అయ్యేలోపు ప్రైమరీ స్కూల్‌లోమౌలిక సదుపాయాల కల్పన. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తక్షణ స్పందన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం. విద్యా వ్యవస్థ బలోపేతం, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు పట్టణంలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, పరిసరాలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవన స్లాబ్ దెబ్బతిన్న విషయాన్ని, సరైన వంట గది లేని ఇబ్బందులను ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శిథిలావస్థకు చేరి ఉన్న స్లాబ్‌కు తక్షణమే మరమ్మత్తులు చేయిస్తామని ప్రకటించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు వీలుగా ఆధునిక వసతులతో కూడిన కిచెన్ షెడ్ నిర్మిస్తామని తెలిపారు.వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభం అయ్యేలోపు పనులన్నీ పూర్తి చేసి మౌలిక సదుపాయాల సమస్య పరిష్కరిస్తానన్నారు. పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసి మౌలిక సదుపాయాల కల్పనపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తక్షణ స్పందన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమాలో స్థానిక టిడిపి ముఖ్య నాయకులతో పాటు మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ కె భారతి తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవులు.. అప్రమత్తతే రక్షణ







బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 23. వేసవి సెలవులు ప్రారంభమైన వేళ విద్యార్థులు, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని బుచ్చిరెడ్డిపాలెం స్టేషన్ హౌస్ ఆఫీసర్ మాతంగి శ్రీనివాసులు సూచించారు. పరీక్షలు ముగిసి పిల్లలు ఎక్కువ సమయం బయట గడిపే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రమాదాలను ముందుగానే అరికట్టడం అత్యంత అవసరమన్నారు. సెలవుల సరదా ప్రాణాంతకంగా మారకూడదంటే పిల్లలను ఒంటరిగా చెరువులు, బావులు, కాలువలు, పెన్నా నది వంటి ప్రమాదకర జలాశయాల వద్దకు వెళ్లనివ్వకూడదని హెచ్చరించారు. నీటి లోతు, ప్రవాహ వేగం అంచనా వేయలేక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉన్నారు అన్న విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో పిల్లలు బయట తిరగకుండా ఇంటి వద్దనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన నీటి ప్రమాదాల గురించి పిల్లలకు వివరించి అవగాహన కల్పించడం అవసరమని తెలిపారు. సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లే వారు అలల ఉధృతిని గమనించి, హెచ్చరిక బోర్డులు ఉన్న చోట నీటిలోకి దిగరాదని స్పష్టం చేశారు. "పిల్లల భద్రత తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంది. వేసవి సెలవుల్లో ఏ కుటుంబంలోనూ విషాదం చోటుచేసుకోకూడదన్నదే మా లక్ష్యం" అని శ్రీనివాసులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100 లేదా 112కు కాల్ చేసి, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# మత్స్యకారుల పక్షాన గళం విప్పుతాం కాకాణి

నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 23. మత్స్యకారులపై చిత్తశుద్ధి లేని కూటమి సర్కార్ జువ్వలదిన్నె హార్బర్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గాలి మత్స్యకారుల బోట్ల మిస్సింగ్ కారకుల్ని శిక్షించాలి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి జువ్వలదిన్నె హార్బర్ పై కూటమి కుట్రలు హార్బర్ ప్రైవేటీకరణ పేరుతో కుయుక్తులు మత్స్యకారులకు అండగా నిలిచిన జగన్ ఆ భయంతో మరిన్ని కుట్రలకు తెరలేపారు మత్స్యకారుల బోట్ల దొంగతనం వెనుక టీడీపీ తప్పుచేసిన మత్స్యకారులు జరిమానా కట్టారు వాళ్ల వెనకున్న టీడీపీ నేతలు తప్పించుకున్నారు చిత్తశుద్ధి ఉంటే వాళ్లపై చర్యలు తీసుకోవాలి మత్స్యకారులకు అండగా నిలిచింది జగనే వేటనిషేధం సమయంలో 10 వేలు ఇచ్చారు డీజిల్ సబ్సిడీ కోసం గుర్తింపుకార్డులిచ్చారు మత్స్యకారుల సంక్షేమంపై చర్చకు మేం సిద్ధం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్ జువ్వలదిన్నె ఫిషింగ్



హార్బర్ ప్రైవేటీకరణ విషయంలో ప్రభుత్వం తప్పు మీద తప్పు చేస్తోందని, మత్స్యకారుల బోట్ల దొంగతనం కూడా ఇందులో భాగమని మాజీ మంత్రి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. బోట్ల దొంగతనం విషయంలో మత్స్యకారుల్లో కొందరు చేసిన తప్పుకు వాళ్ల పెద్దలు జరిమానాలు విధించారని, కానీ దీన్ని ప్రోత్సహించిన టీడీపీ నేతలు బీద మస్తాన్ రావు, బీద రవిచంద్రలపై మాత్రం చంద్రబాబు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని కాకాణి ఆక్షేపించారు. మత్స్యకారుల సంక్షేమానికి ఎవరేం చేశారో తేల్చేందుకు తాము చర్చకు సిద్ధంగా ఉన్నట్లు కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాల్ విసిరారు.ప్రెస్ మీట్ లో కాకాణి గోవర్ధన్ రెడ్డి

# రెండో పంటకు కూడా సాగునీరు.. కానీ నీటి పొదుపు తప్పనిసరి







కోవూరు పెన్ పవర్ ఏప్రిల్ 23. సాగునీటి కాలువల్లో కాలుష్యం జలాలు వదిలే అక్రమ చేపల చెరువులపై కఠిన చర్యలు తీసుకోండి.సాగునీటి నిర్వహణలో కీలక పాత్ర పోషించే లస్కర్ల జీతాలు వెంటనే చెల్లించండి సూపర్ ఎల్నినో ముప్పు నేపథ్యంలో నీటి పొదుపు పాటించండి.నీటి పన్ను బాకీల వసూళ్లపై రెవెన్యూ శాఖ దృష్టి సారించాలి. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. 1973లో 3.45 టీ .ఎం .సి .ల సామర్థ్యం ఉన్న కనిగిరి రిజర్వాయర్ గత 50 ఏళ్లలో పూడిక కారణంగా నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయిందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జరిగిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కనిగిరి రిజర్వాయర్ పునరుద్ధరణకు 48 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి చంద్రబాబు నాయుడు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని రెండో పంటకు కూడా నీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు.అయితే వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల ఈ ఏడాది తీవ్రమైన ఎండలు ఉండే అవకాశం ఉన్నందున అధికారులు మరియు సాగునీటి సంఘ నాయకులు మరియు రైతు సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేసి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కనిగిరి రిజర్వాయర్ నుండి రామతీర్థం వరకు ఉన్న 1 లక్ష10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందాలంటే లస్కర్ల పాత్ర కీలకమని ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ మరియు ఇరిగేషన్ ఉన్నతాధికారులను కోరారు. సంగం బ్యారేజ్ ఆధునీకరణ నేపథ్యంలో కనిగిరి మెయిన్ కెనాల్ ద్వారా రిజర్వాయర్‌కు ధామాషా ప్రకారం నీటి కేటాయింపులు జరగాలని డిమాండ్ చేశారు.మరోవైపు, సాగునీటి కాలువల వెంబడి అక్రమంగా చేపల చెరువులు ఏర్పాటు చేసి, కలుషిత నీటిని కాలువల్లోకి వదలడంపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల సాగునీటి నాణ్యత దెబ్బతింటోందని ఇటువంటి అక్రమ చర్యలపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నీటి పన్ను వసూళ్లపై రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. దాదాపు 38 కోట్ల బకాయిలు ఉండగా కేవలం 2 కోట్ల 88 వేల రూపాయలు మాత్రమే వసూలయ్యాయని నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేసేలా ప్రత్యేకచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాటు ఇరిగేషన్ అధికారులు,పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# అనుమతులు లేని పత్తి విత్తనాలు సీజ్

ఎమ్మిగనూరు (కర్నూలు) : పెన్ పవర్, ఏప్రిల్ 23, పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఏజెన్సీస్, గంజహళ్లి రోడ్డులో అనధికారికంగా విత్తనాలకు సంబంధించిన ఎలాంటి సోర్స్ లేకుండా విత్తనాలు అమ్ముతుండగా మొత్తం 957 ప్యాకెట్లు సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి, మండల వ్యవసాయ అధికారి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గంజిహళ్లి రోడ్డు లో అనుమతులు లేని విత్తనాలను గుర్తించి సీజ్ చేశారు. వీటి విలువ రూ,8,62,257 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారి శివశంకర్ మాట్లాడుతూ .... సర్ప్రైజ్ విజిట్ లో భాగంగా తనిఖీ చేయగా విత్తన దుకాణంలో అనధికారికంగా విత్తనాలు ఉంచుకొని ఎలాంటి సోర్స్ లేకుండా రైతులకు విక్రయిస్తుండగా మొత్తం 957 ప్యాకెట్లు సీజ్ చేసి , 6ఏ కేసు నమోదు చేయడమైనదని చెప్పారు. ఈ విత్తనాల విలువ రూ.8,62,257గా ఉందని, విత్తనాలను బిజినెస్ చేసుకునే డీలర్లకు ముఖ్యంగా ఫారం -- జసర్టిఫికేట్, రైతులకు విక్రయించే అన్ని రకాల విత్తనాలు లైసెన్సులో ఇంక్లూడ్ అయి ఉండాలని చెప్పారు.

# మహర్షి భగీరథుని స్ఫూర్తితో జల సంరక్షణకు పెద్దపీట.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..





విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 23, గంగను భూమీమ్మదకు తెచ్చిన మహనీయులు మహర్షి భగీరథను స్మరించుకుంటూ సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ జల సంరక్షణలో కీలక భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మహర్షి భగీరథ జయంతి సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి భగీరథుని చిత్రపటానికి పూల మాలలు వేసి మహనీయుని స్ఫూర్తి పథాన్ని స్మరించుకున్నారు. భగీరథుని పట్టుదల స్ఫూర్తిని స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గాన్ని, అనుసరించాల్సిన అవసరాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకంగా జలధార-జలహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. 100 రోజుల కార్యాచరణతో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నీటి వనరులను సంరక్షించడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను కాపాడుకోవడం వంటి అంశాల్లో ప్రజలందరూ చైతన్యంతో ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.జగ్గయ్య, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# కమిషనర్ వై. ఓ నందన్ ఘనంగా సన్మానం



నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 23. నెల్లూరు నగరపాలక సంస్థ గత ఆర్థిక సంవత్సరం 2025-26 కు గాను పన్నుల వసూళ్లలోఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భాన్ని పురస్కరించు కొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, కమిషనర్ / డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సంపత్ కుమార్‌లు విజయవాడలోని కమీషనర్స్ కాన్ఫరెన్స్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ / ఆర్కిటెక్చర్ ప్రాంగణంలో కమిషనర్ వై.ఓ నందన్ ను గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు.

# రాజకీయాల్లో నాదెండ్లది ప్రత్యేక శైలి.. జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి..





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 22, రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు రాజకీయ ధురందరుడుగా వినుతికెక్కారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను ఓడించడంలో ఎత్తుకుపైఎత్తు వేయటంలో అయన దిట్ట అంటూ వ్యాఖ్యానించ్చారు. బుధవారం వయోభారంతో పాటు అనారోగ్య కారణాలతో మరణించిన నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు సద్గతి కలగాలని అయన దేవుణ్ణి ప్రార్ధించారు. ఈ మేరకు గురువారం శ్రీనివాసరావుతోటలోని గాజు గ్లాస్ దిమ్మె వద్ద నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి ఆళ్ళ హరి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. న్యాయవాది నుంచి రాజకీయాల్లో రాణించటం వరకు కొనసాగిన నాదెండ్ల ప్రస్థానం ఓ సంచలనమన్నారు. అయన కుమారుడు జనసేన అగ్రనేత నాదెండ్ల మనోహర్ పితృ వియోగ విషాదం నుంచి త్వరగా బయటపడాలని ఆకాంక్షించ్చారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడుని ఆళ్ళ హరి ప్రార్ధించ్చారు. నాదెండ్ల భాస్కరరావుకు శ్రద్ధాంజలి ఘటించిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపు సాంబశివరావు, జనసేన నగర కార్యదర్శి షేక్ మెహబూబ్ బాషా , కోలా అంజి , వడ్డె సుబ్బారావు , నందూరి సుబ్బారావు , స్టూడియో బాలాజీ , ఇల్లా చిరంజీవి , జక్కా రాఘవులు తదితరులున్నారు.

# ఎల్.ఎ.సాగరం హైస్కూల్ విద్యార్థుల బడి పిలుస్తోంది ర్యాలీ...




నాయుడుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 23 నాయుడుపేట పట్టణంలోని ఎల్ ఏ సాగరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.ఎంఈఓ బి మునిరత్నం ర్యాలీని ప్రారంభించారు.అనంతరం విద్యార్థినీ,విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల వద్ద నుండి గాంధీ మందిరం వరకు బడి పిలుస్తుంది అంటూ ర్యాలీ నిర్వహించారు.ప్రైవేటు పాఠశాలల వద్ద ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సుబ్రహ్మణ్యం,

ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు,జి వెంకటేశ్వర్లు నాయుడు,గుంపర్ల సుబ్రహ్మణ్యం,కందనూరు రాఘవేంద్ర,సూర్య రావు,సుభాష్ చంద్ర,పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ నెలవల చంద్రశేఖర్, వైస్ చైర్మన్ షేక్ జమీల,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల పై వివక్షత పోవాలి ఆమార్పు ఇంటి నుండే మొదలు అవ్వాలి...సిస్టర్ వసుంధర...



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 23, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ లో భాగంగా సిస్టర్ విద్యా ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లి మండలం డోలాస్ నగర్ లో ఉన్న దుర్గ భాయ్ కిశోర బాలికల గ్రూప్ సభ్యుల సమావేశంలో సిస్టర్ వసుంధర మాట్లాడుతూ భారత్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అయినప్పటికీ ఇంకా చాలా మందిలో ఆడపిల్ల అంటే చిన్న చూపే ప్రభుత్వం ఎప్పటికప్పుడు కట్టినమైన చట్టాలు చేయడం వల్ల కొంతమేర ఊరట లభించిందని ప్రజలందరి భావజాలంలో మార్పు కలగాలిలి ఆడపిల్ల తక్కువ,మగపిల్లవాడు ఎక్కువ అనే ధోరణిని మార్చుకోవడం,కుటుంబం నుండే లింగ అసమానత తొలగి పోవాలి అంటే స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే ఇద్దరికీ సమాన హక్కులు,బాధ్యతలు, అవకాశాలు మరియు గౌరవం కల్పించబడాలి,అదే స్థిరమైన అభివృద్ధికి,శాంతియుత సమాజానికి అత్యంత ఆవశ్యకం అని విద్య,ఉపాధి, నిర్ణయాధికారం మరియు వేతనాల్లో లింగ భేదాలు లేకుండా అందరికీ సమాన ప్రాధాన్యత లభించినప్పుడే దేశంఅభివృద్ధి చెందుతుందని మహిళలకు ఆడపిల్లలకు రక్షణ భరోసా కల్పించే కఠిన చట్టాలు అమలుచేయబడాలి లింగ సమానత్వం గురించి చిన్నతనం నుండి పిల్లల్లో అవగాహన పెంచడం వలనే కొంత కాలానికి మార్పు సాధించగలుగుతాంఅని లింగ సమానత్వం అనేది స్త్రీ, పురుషులిద్దరి ప్రగతికి, కుటుంబం మరియు దేశాభివృద్ధికి మూలాధారంలి మా సంస్థ ద్వారావీటి గురించే ఎక్కువగా ప్రజలలో చైతన్యం కల్పిస్తున్నాంఅని అన్నారు. తరువాత అత్తోట పోతురాజు మాట్లాడుతూ లింగ భేదం లేకుండా విద్య, ఉద్యోగం, ఆరోగ్య సంరక్షణ మరియు ఆస్తులపై స్త్రీ పురుషులు ఇద్దరికీ సమాన హక్కులు ఉన్నాయనే భావన అందరిలో కలగాలి,లింగం ఆధారంగా అసమాన ప్రవర్తన,వేధింపులు తొలగి పోవాలి కుటుంబం,సమాజం మరియు రాజకీయాల్లో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించాలి, మహిళలకు ఆర్థిక వనరులపై నియంత్రణ మరియు సమాన వేతనం పొందడం ఒక హక్కుగా ఉండాలి ప్రజలఅందరిలో తమ లింగ సంబంధిత వైఖరులు మరియు నమ్మకాలను సవరించుకునేలా అవగాహన కల్పించబడాలి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.4 బిలియన్ల మహిళలకు పురుషులతో సమానమైన ఆర్థిక హక్కులు లేవు అని భారతదేశంలో లింగ సమానత్వ సూచీలో మార్పులు అవసరం,చిన్న దేశాలు సైతం ఈ విషయంలో మెరుగ్గా ఉన్నాయని ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ ఆధారంగా మహిళల సాధికారత పైదృష్టి పెట్టాలని వారి కొరకు ప్రత్యేక ప్రణాళికలో తయారు చెయ్యాలని సూచించింది అని అన్నారు.ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంధ సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు పెద్దిపాగ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు...

# ఎమ్మెల్యే డా.నెలవల విజయ శ్రీ,సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర లకు ఘన సన్మానం... టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి...



నాయుడుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 23 సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర లను తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి ఘనంగా సన్మానించారు.మేనకూరు సెజ్ లోని పెళ్ళకూరు మండలం పాలచూరు వద్ద సంగం డైరీ విస్తరణ పనులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర లు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగావారికి టిడిపి నేత కట్టా వెంకట రమణారెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కట్టా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మేనకూరు సెజ్ లో పరిశ్రమల ఏర్పాటుకు తన వంతు తోడ్పాటు అందిస్తున్నారని తెలియ జేశారు.ఈ ప్రాంతంలో సంగం డైరీ ని ఆ సంస్థ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర ఏర్పాటు చేయడంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతా యన్నారు. నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్‌పై కఠిన చర్యలు -- రూ.10,000 జరిమానా



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23: చిలకలూరిపేట : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని స్థానిక ఏజేసీజే కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

# ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ నూతన డైరెక్టర్ గా గడ్డం విజయ్ ప్రకాష్

వేంపల్లె (కడప) :పెన్ పవర్, ఏప్రిల్ 23, ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీ (ఆర్కే వ్యాలీ) నూతన డైరెక్టర్ గా ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం విజయ్ ప్రకాష్ ను నియమిస్తూ బుధవారం ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులు జారీ చేశారు. గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్జీయూకేటీ ఉప కులపతి, ఆర్కేవ్యాలీ, శ్రీకాకుళం డైరెక్టర్లును నూతనంగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్జీయూకేటీ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఐఐటి కాన్పూర్ లో కెమిస్ట్రీ డిపార్ట్ మెంట్ కు సంబంధించిన రసాయన విభాగంలో హెచ్ ఏ జీ గా పని చేస్తున్న ప్రొఫెసర్ మద్దాలి లక్ష్మి నారాయణరావును ఆర్జీయూకేటీ ఉప కులపతిగా నియమించడం జరిగింది. అలాగే ఐఐటి హైదరాబాద్ లోని రసాయన ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గిరిధర్ మద్రాస్ ను శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ గా నియమించాగా ఐఐటి ఢిల్లీ భౌతిక శాస్త్ర విభాగంలో హెచ్ ఏజీగా ఉన్న ప్రొఫెసర్ గడ్డం విజయ్ ప్రకాష్ ను ఇడుపులపాయి (ఆర్కే వ్యాలీ) ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ గా నియమించినట్లు ఆర్జీయూకేటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలి.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..






విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 23, ప్రకృతి సాగుతో నేలతల్లి ఆరోగ్యం బాగుంటుందని.. ఈ సాగు విధానాలతో పాటు సమతుల ఎరువుల వినియోగంపై రైతులకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ధర్తి మాత బచావో అభియాన్ (భూ మాత పరిరక్షణ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఉద్దేశించిన కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేయాల్సిన అవసరముందన్నారు. పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందిస్తూ, సాగు ఖర్చులను తగ్గించడం, నేల సారాన్ని పెంచడం వంటివాటిపై ప్రధానంగా దృష్టిపెట్టాలన్నారు. రైతులు రసాయన ఎరువులతో పాటు జీవ ఎరువులను సమతులంగా వినియోగించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ముఖ్యంగా నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఎరువుల తయారీ సంస్థలు, శాస్త్రవేత్తలు కలిసి రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామస్థాయిలో మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువుల సరఫరా, వినియోగంపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొంటూ పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు కేటాయించిన ఎరువులు ఇతర ప్రాంతాలకు మళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎరువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికంగా యూరియా వినియోగం జరుగుతున్న 100 గ్రామాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. సమావేశంలో ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సరిత, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయ కుమారి, జిల్లా సహకార అధికారి అనిత, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం, కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు శాస్త్రవేత్త డా. శివ ప్రసాద్, పరిశ్రమల శాఖ ఐపీఓ రవి, ఆర్‌సీఎఫ్, సీఐఎల్ సంస్థల ప్రతినిధులు పునీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

# ప్రపంచ పుస్తక దినోత్సవం




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 23: చిలకలూరిపేట : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) స్వచ్ఛంద సేవాసంస్థ, జనవిజ్ఞానవేదిక మరియు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పుస్తక దినోత్సవం జరిగింది.. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. జనవిజ్ఞానవేదిక డివిజన్ కార్యదర్శి బొంత అజయ్ బాబు మాట్లాడుతూ పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ ప్రపంచ గతిని మార్చిన వారంతా పుస్తక పఠనం ద్వారానే మేధావులు అయ్యారన్నారు. అలాగే ప్రముఖ న్యాయవాది,దళిత చైతన్య స్రవంతి అధ్యక్షులు నల్లపు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పఠనాసక్తి బాగా తగ్గిందన్నారు. పిల్లలను పఠనాసక్తులుగా మార్చే బాధ్యత తల్లిదండ్రులదన్నారు. పిల్లలను సెల్ పోను కు దూరంగా ఉ ంచి ప్రత్యామ్నాయంగా పుస్తకం ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన జీవనశైలి ఆరోగ్యసమస్యలు శాస్త్రీయ అవగాహన - పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు పుస్తకపఠనంపై పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులందరికీ మాజీ ఎమ్మెల్సీ కె .యస్. లక్ష్మణ్ రావు రూపొందించిన భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు, భారత రాజ్యాంగం నిర్మాణం పీఠిక పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గార్డ్స్ కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, ఉపాధ్యక్షులు గేరా యాకోబు , జెవివి డివిజన్ అధ్యక్షులు ధూళిపాళ వెంకట్రావు, షేక్ లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు సిద్ధాంతి కరిముల్లా రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షులు చెవుల సుబ్బారావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి డా.దార్ల బుజ్జిబాబు, గార్డ్స్ సభ్యులు కుల్లి రాజా, వడ్లాన శరత్ చంద్ర, జెవివి ఉపాధ్యక్షులు టి.ప్రతాపరెడ్డి, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి డీ.వీర్రాజు, సిబ్బంది సరోజినీ, సాంబి రెడ్డి తదితరులున్నారు.

# వీరబ్రహ్మేంద్రస్వామి వారు అందరివాడు విశ్వబ్రాహ్మణుల సొంతం కాదు..

## విశ్వబ్రాహ్మణ సీనియర్ నాయకులు పావులూరి హనుమంతరావు.



పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 23: 26వ తేదీ వైశాఖ శుద్ధ దశమి రోజు శ్రీ శ్రీ శ్రీ మత్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు సజీవ సమాధి గడించిన సందర్భాన్ని పురస్కరించుకొని వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న నేపద్యములో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి విశ్వబ్రాహ్మణులు కూడా స్వామివారి కార్యక్రమంలో అందరిని బాగాస్వామ్యం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందరికీ పంపిణీ చేయవలసిన బాధ్యత ప్రతి విశ్వబ్రాహ్మణునికి ఉందని విశ్వబ్రాహ్మణ సీనియర్ నాయకులు పావులూరి హనుమంతరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి వారు తన బోధనలో తననను విగ్రహారాధన చేయమని చెప్పలేదు కానీ షడ్ చక్ర సాధన గురించి మన యోగ ప్రాణాయమం గురించి చెప్పిన వ్యక్తి మానవుడు మనలోని భగవంతుడు ఉంటాడు అని మనలోనే భగవంతుడిని దర్శించడం పరమాత్ముని సందర్శించడం అని బోధన చేసిన మహాజ్ఞాని, తత్వవేత్త, యుగ పురుషుడు, మహా గురువు, జగద్గురు 400 సంవత్సరాల క్రితం ఆనాడు సమాజంలో ఉన్న రుగ్మతలను పోగొట్టడానికి సమసమాజ స్థాపనకు అప్పటి నవాబు పాలనలో పూర్తిస్థాయి హిందువులు అని చెప్పుకోవడానికి భయపడే రోజుల్లో స్వామివారు నవాబు మహారాజులను మెప్పించి మానవులంతా సమానమే కుల మతాలకు తావులేదు అని ప్రబోధించిన సందర్భాన్ని పావులూరి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ రోజులలో స్వామివారు ప్రత్యేక శిష్యబృందం గరిమారెడ్డి అచ్చమ్మ కు జ్ఞాన బోధ చేయడం జరిగిందని, ఆనంద భైరవయోగి క్షత్రియ, అన్నజయ బ్రాహ్మణ, కక్కయ్య మాదిగ, సిద్దయ్య దూదేకుల కులము చెందిన వారిని తన బృందంగా చేర్చుకొని కాలజ్ఞాన సహిత బోధనలను ప్రపంచానికి చాటి చెప్పిన మహా జ్ఞాని శ్రీశ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారిని అన్నారు. ప్రపంచంలో ఎలాంటి వింత జరిగిన అప్పట్లో బ్రహ్మంగారూ చెప్పారని నానుడి నేటి సమాజంలో జరుగుతుందని బనగానపల్లె లో గోపాలుగా ఉండి రవ్వలకుంటలో యాగంటి గృహాలలో తపస్సు చేస్తూ దివ్య శక్తి సంపాదించి కాలజ్ఞానాన్ని రచించారని అనంతరం కడప జిల్లా కందిమల్లాయ పల్లికి వచ్చి గృహస్టా ఆశ్రమంలో ఉండి వారి యొక్క బోధనలను తన శిష్య బృందం ద్వారా ప్రపంచానికి తెలియజేసి సజీవ సమాధి పొందారని ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ శ్రీ శ్రీ శ్రీ మత్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వీరబ్రహ్మేంద్రస్వామి వారి చెప్పిన కలియుగ సమాప్తి సంబంధించిన అనేక సంఘటనలు నెరవేరుతున్న నేపథ్యంలో కాలజ్ఞానం యొక్క ప్రతులను దాని బోధనలను పూర్తిస్థాయిలో సేకరించి ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా రాజధాని అమరావతి ప్రాంతంలో స్వామివారి నాలెడ్జి సెంటర్ దివ్య క్షేత్రమును ఏర్పాటు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గుంటూరులో విలియం షేక్స్పియర్ జయంతి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే గల్లా మాధవి..




గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 23, ప్రముఖ సాహితీవేత్త విలియం షేక్స్పియర్ జయంతి సందర్భంగా పుత్తూరులో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ.. షేక్స్పియర్ కేవలం ఇంగ్లీష్ భాషకు పరిమితమైన రచయిత కాదని, ఆయన రచనల్లో సమాజం, వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, మానవ మనస్తత్వం యొక్క విభిన్న కోణాలు ప్రతిబింబిస్తాయని, ఆయన రచనలు ప్రతి మనిషి జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, ప్రతి పాత్రలో మనిషి స్వభావాన్ని అద్భుతంగా చిత్రీకరించిన గొప్ప నాటక కర్తగా షేక్స్పియర్ నిలిచారని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. "ప్రపంచం ఒక వేదిక, అందులో మనుషులు నటులే" అనే ఆయన భావనలో ఉన్న లోతైన ఆధ్యాత్మికతను, విద్యార్థుల్లో సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి స్పష్టం చేశారు. నేటి యువతలో చాలా మంది ఇంజనీరింగ్, వైద్య రంగాలవైపు మాత్రమే మొగ్గు చూపుతున్నారని, సాహిత్యాన్ని తక్కువగా చూడటం సమాజానికి నష్టకరమని పేర్కొన్నారు. సాహిత్యం చదవడం అనేది కేవలం ఒక కోర్సు కాదని, అది ఒక జీవన విధానం అని, దీనికి ప్యాషన్‌తో పాటు లోతైన ఆలోచన అవసరమని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో ముందుకు సాగుతూ సమాజానికి సేవ చేయాలని, సాహిత్యం ద్వారా జీవితాన్ని అర్థం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎమ్మెల్యే గల్లా మాధవి ఆకాంక్షించారు...

# విన్నకోట సురేష్ సౌజన్యంతో జర్నలిస్టులకు హెల్మెట్లు బాపట్లలో భారీ ర్యాలీ







పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 23: జర్నలిస్టుల సంక్షేమం, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ ర్యాలీకి జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆయన సౌజన్యంతో ప్రెస్ క్లబ్ సభ్యత్వం కలిగిన 181 మంది జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేయడం విశేషంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ముఖ్య అతిథులుగా హాజరై హెల్మెట్లను అందజేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం నుంచి జమ్మలపాలెం ఫ్లైఓవర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతపై సందేశాలతో సాగిన ఈ ర్యాలీని కలెక్టర్, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు విన్నకోట సురేష్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. జర్నలిస్టుల భద్రతపై ఆయన చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం ప్రాణ రక్షణకు అత్యవసరమని స్పష్టం చేశారు. సమాజానికి మార్గనిర్దేశం చేసే జర్నలిస్టులు ముందుండి ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ చేపట్టిన కార్యక్రమం ఆదర్శప్రాయమని, ముఖ్యంగా జర్నలిస్టుల కోసం హెల్మెట్లు అందించిన విన్నకోట సురేష్ ఉదారత ప్రశంసనీయం అన్నారు. డీఎస్పీ చంద్ర మౌళి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో హెల్మెట్ వినియోగం కీలకమని తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె. పరంధామరెడ్డి ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సభ్యుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన విన్నకోట సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ తనిఖీ అధికారి డి.బి.బి. రంగారావు, ప్రసన్నకుమారి, పట్టణ సీఐ ఆర్. రాంబాబు, ఎస్సై నస్రిమ్, జిల్లా సమాచార అధికారి వెంకటరమణ, కోశాధికారి బుర్ర ఆంజనేయులు, సమాచార కార్యదర్శి బండ్రెడ్డి గోపి తదితరులు, చీరాల, రేపల్లె, వేమూరు, పర్చూరు ప్రాంతాల ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విప్పర్లపల్లిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి శీతల ప్రతిష్ట మహోత్సవం

## శీతల ప్రతిష్ట విశిష్టతను వివరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట, పెన్ పవర్ ఏప్రిల్ 23: రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం శీతల ప్రతిష్ట మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లు తదితర పంచామృతాలతో స్వామివారికి శీతల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ, శీతల ప్రతిష్ట విశిష్టతను భక్తులకు వివరించారు. ప్రతిష్ట సమయంలో యాగాది క్రతువుల వల్ల విగ్రహంలో ఏర్పడే ఉష్ణాన్ని తగ్గించి, దేవతా మూర్తిలో సౌమ్యతను, శాంతిని నెలకొల్పడమే శీతల ప్రతిష్ట ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ముఖ్యంగా నరసింహ స్వామి వంటి ఉగ్ర రూపాలకు శీతల ప్రతిష్ట అత్యంత అవసరం అని, దీని వల్ల స్వామివారు భక్తులకు శాంతిని, శుభాలను ప్రసాదిస్తారని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, విప్పర్లపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్వామివారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రొంపిచర్ల మండల ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


# వడదెబ్బ నివారణకు హోమియో మందుల పంపిణీ

నందిగామ (ఎన్టిఆర్) : పెన్ పవర్, ఏప్రిల్, 23: నందిగామ పట్టణం గాంధీ సెంటర్‌లో గురువారం భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ కోసం ఏర్పాటు చేసిన ఉచిత హోమియో మందుల పంపిణీ శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య కూటమి నేతలతో కలిసి ప్రజలకు స్వయంగా హోమియో మందులను పంపిణీ చేశారు. పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. సేవా సంస్థలు వేసవి కాలంలో ప్రజల ఆరోగ్య భద్రత కోసం ముందుకు రావడం అభినందనీయమని, ప్రభుత్వం కూడా వడదెబ్బ నివారణ చర్యలను మరింత బలోపేతం చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

# కోటప్పకొండ చరిత్రను తెలిపే డాక్యుమెంటరీ ఆవిష్కరణ

## ముఖ్యఅతిథిగా ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు







నరసరావుపేట, పెన్ పవర్ ఏప్రిల్ 23: నరసరావుపేట శాసనసభ్యుల కార్యాలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రాష్ట్ర దేవాదాయ శాఖ సౌజన్యంతో రూపొందిన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి దేవాలయ చరిత్ర డాక్యుమెంటరీ ఫిలింను గురువారం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. ప్రముఖ సినీ నటులు, కళారత్న డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ ఈ డాక్యుమెంటరీని కళాంజలి క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మించి దర్శకత్వం వహించారు. త్రికోటేశ్వరస్వామి క్షేత్ర మహత్యం, స్థల పురాణం, ఆలయ చరిత్రను ఈ చిత్రంలో వివరంగా పొందుపరిచారు. శతాబ్దాల చరిత్ర కలిగిన కోటప్పకొండ దేవాలయ విశిష్టతను దృశ్యరూపంలోకి తీసుకురావడం వెనుక డాక్టర్ చిట్టినేని చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్యే అరవిందబాబు కొనియాడారు. కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ, ఇలాంటి డాక్యుమెంటరీలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. కోటప్పకొండ క్షేత్రం లక్షలాది మంది భక్తులకు ఆరాధ్య దైవంగా ఉన్న నేపథ్యంలో దాని చరిత్రను డాక్యుమెంటరీ రూపంలో భద్రపరచడం గొప్ప విషయమని అభిప్రాయపడ్డారు. దర్శక నిర్మాత డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి. చంద్రశేఖర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై డాక్యుమెంటరీని వీక్షించారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల చరిత్రను డాక్యుమెంటరీలుగా మలిచే కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ చేపట్టడం హర్షణీయమని పలువురు పేర్కొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు






నరసరావుపేట, పెన్ పవర్ ఏప్రిల్ 23: విద్యార్థుల కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. గురువారం స్థానిక బరంపేటలోని ఎస్బీఆర్ ఎంపీఎల్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రాథమిక విద్యే బలమైన పునాది లాంటిది అని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావు పేట, పెన్ పవర్ ఏప్రిల్ 23: పల్నాడులో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ కృతికా శుక్లా గురువారం ఒక ప్రగటనలో తెలిపారు. కార్మికులు సమీప కార్మికశాఖ కార్యాల యాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు తప్పనిసరిగా నమోదు చేసుకొని గుర్తింపు కార్డు పొందాలని కార్మికులకు సూచించారు. నమోదు చేసిన కార్మికులకు వివిధ సంక్షేమ పథకాల కింద ఆర్థిక సహాయం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# ఎమ్మెల్యే చదలవాడ ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు

## రెండేళ్లలో రూ.35 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని వెల్లడి

## విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడి






నరసరావుపేట, పెన్ పవర్ ఏప్రిల్ 23: నరసరావుపేట గుంటూరు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నరసరావుపేట పట్టణ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణ, రొంపిచర్ల మండల అధ్యక్షులు పల్లెల నాగిరెడ్డి పాల్గొని రెండేళ్లలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. పట్టణంలో వార్డుల వారీగా అభివృద్ధి, తెలుగుదేశం పార్టీ నరసరావుపేట పట్టణం. పట్టణ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధే ప్రధాన అంశమని తెలిపారు. వన్ టైమా, లాంగ్ టైమా? అనేది 2029న జరగబోయే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారు అన్నారు. ఓటుతోనే వారు సమాధానం చెబుతారు అని చెప్పారు. అభివృద్ధి చేసిన నాయకుడికే ప్రజలు పట్టం కడతారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడంతో సుమారు రూ.18 కోట్ల వార్షిక బడ్జెట్ నిధులు వెనక్కి వెళ్లాయని, అయినప్పటికీ నాయకులు వారానికి రెండు, మూడు సార్లు సచివాలయం చుట్టూ తిరిగి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో మాట్లాడి ఎమర్జెన్సీ గ్రాంట్ల కింద సుమారు రూ.15 కోట్ల నిధులు తెచ్చారని అయన వివరించారు.

వార్డుల వారీగా పనుల వివరాలు: 1వ వార్డులో: రూ.4 లక్షలతో పైప్‌లైన్లు

2వ వార్డులో: వనమా సుబ్బారావు లైన్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు

3వ వార్డులో: రూ.5 లక్షలతో సీసీ రోడ్డు

4వ వార్డులో: రూ.17 లక్షలతో సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ. 5వ వార్డులో: రూ.9 లక్షలతో వాటర్‌లైన్‌లు. 6, 7 వార్డులలో: రూ.50 లక్షలతో సీసీ రోడ్లు. 8వ వార్డులో: రూ.10 లక్షలతో సీసీ రోడ్లు.

9వ వార్డులో: రూ.4 లక్షలతో పైప్‌లైన్లు.

11వ వార్డులో: రూ.65 లక్షలతో సీసీ రోడ్లు. 12వ వార్డులో: రూ.20 లక్షలతో సీసీ రోడ్డు. 13వ వార్డులో: టౌన్‌హాల్ వద్ద రూ.14 లక్షలతో సైడ్‌లైన్లు. 15వ వార్డులో: రూ.9 లక్షలతో అభివృద్ధి పనులు. 16వ వార్డులో: రూ.3 లక్షలు, 17, 18 వార్డులలో: రూ.8 లక్షలతో రోడ్లు. 20వ వార్డులో: రూ.7 లక్షలతో పైప్‌లైన్లు. 24వ వార్డులో: రూ.29 లక్షలతో సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో సైడ్ డ్రెయిన్లు. 25వ వార్డులో: కలెక్టర్ కార్యాలయం ఎదురుగా రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు. అంతేకాకుండా వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి వార్డులోనూ అవసరమైన చోట పైప్‌లైన్లు వేశామని తెలిపారు.

రొంపిచర్ల మండలంలో రూ.20 కోట్లతో జలజీవన్ పనులు:

అనంతరం మాట్లాడిన రొంపిచర్ల టీడీపీ అధ్యక్షులు పల్లెల నాగిరెడ్డి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా అవాస్తవాలు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హయాంలో ఏం అభివృద్ధి జరిగిందో అంకెలతో సహా వివరించారు.

రొంపిచర్ల మండల అభివృద్ధి పనులు

జలజీవన్ మిషన్ పథకంలో అన్ని గ్రామాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్ కోసం రూ.20 కోట్లు ఖర్చు చేశామన్నారు.

అన్నవరం గ్రామం: సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లకు రూ.3 కోట్లు, రొంపిచర్ల-కర్లకుంట బీటీ రోడ్డు: రూ.2 కోట్లు

సుబ్బయ్యపాలెం: రూ.1 కోటితో గ్రావెల్ రోడ్డు. గోగులపాడు: రూ.1.5 కోట్లతో గ్రావెల్ రోడ్డు. కొనకొంజర్ పాలెం: రూ.1 కోటితో గ్రావెల్ రోడ్డు. రామ్‌రెడ్డి పాలెం: రూ.1 కోటితో గ్రావెల్ రోడ్డు. అడ్డరోడ్డు-అడ్డవాడిపేట: రూ.1 కోటితో బీటీ రోడ్డు. ఈ విధంగా ఒక్క రొంపిచర్ల మండలంలోనే (ఎన్.జి.ఆర్.సి.ఎస్) కింద దాదాపు రూ.7 కోట్ల పనులు జరిగాయని, ఇది పల్నాడు జిల్లాలో ఏ మండలంలోనూ సాధ్యం కాలేదని పేర్కొన్నారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి సొంత మండలం రొంపిచర్లకు, సొంత ఊరికి ఏం చేశారో చెప్పాలని, బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గోపిరెడ్డి సొంత గ్రామంలో పీ4 కింద వడ్లమూడి కిషోర్ రూ.10 లక్షలతో అంగన్‌వాడీ భవనాన్ని అప్‌గ్రేడ్ చేస్తే ఎండీఓ, డీపీఓలను బెదిరించి అడ్డుకున్నారని, చివరికి ఎమ్మెల్యే అరవింద బాబు జడ్పీ సీఓ వద్దకు వెళ్లి అనుమతి తెచ్చి ప్రారంభించారని ఆరోపించారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్ భవనాన్ని కూడా తామే కట్టించామని, కాంట్రాక్టర్ అల్లావుద్దీన్‌తో తమ హయాంలోనే పూర్తి చేశామని తెలిపారు. ఇటుక పెట్టలేదు, తట్ట మట్టి ఎత్తలేదు అని గోపిరెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైసీపీ అంతర్గత గొడవలను తమ నాయకులపై రుద్దుతున్నారని, 70ఎంఎం సినిమా చూపిస్తానంటున్నారు. మాకు సినిమా చూపించాలంటే 90ఎంఎం సినిమా చూపిస్తాం అని నాగిరెడ్డి హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చల్లగుల్ల హరికృష్ణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వెంపరాల కాశీం సైదులు, నరసరావుపేట పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు మడక ప్రసాద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గర్నెపూడి నాయుడు, నరసరావుపేట మండల బీసీ సెల్ అధ్యక్షులు దాసరి నరసింహారావు లు పాల్గొన్నారు.

# పిల్లలను మొబైల్ కి దూరంగా ఉంచండి ఐసిడిఎస్





నరసరావు పేట, పెన్ పవర్ ఏప్రిల్ 23: ఐసిడిఎస్ ప్రాజెక్టు నర్సరావుపేట పరిధి నందు పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నరసరావుపేట ప్రాజెక్టు కార్యాలయం నందు సిడిపిఓ ఎన్ కాంత కుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడి ఉమాదేవి మాట్లాడుతూ పిల్లలకు కుటుంబాలు ఫోన్ స్క్రీన్ ను అందుబాటులో ఉంచకూడదని అలానే పిల్లలకు పుస్తకాలు వ్యక్తిగత ఆటలు, కుటుంబ సభ్యులు కలిసిమెలిసి ఆడుకునేటట్లు ఉండాలని ఆమె అన్నారు. 02 సంవత్సరం వయసు పిల్లలను వారి మెదడు అభివృద్ధి అవసరమైన ప్రేరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పిల్లలకు మంచి పోషకాహారం అందించవలనని పాకెట్ ఫుడ్డు మరియు జంక్ ఫుడ్లను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా టీవీ ఫోను స్క్రీన్ లకు దూరంగా ఉంచి శరీరక శ్రమ ఉన్న ఆటలకు ప్రాముఖ్యత ఇవ్వాలని తెలియజేశారు. ఆహారంలో చక్కెర నూనె ఉప్పు ఉనియోగాన్ని తగ్గించి ప్రోటీన్లు ఉన్న ఆహారాన్ని అందించవలనని అలానే పిల్లలకు చిన్నప్పటినుండి మంచి అలవాటులను ప్రోత్సహించి వారి బంగారు భవితకు అవకాశం కల్పించాలని తెలిపారు. హెల్త్ ఈజ్ వెల్త్ ఆరోగ్యమే మహాభాగ్యం ఈ భావనను గ్రామాలలో ఉన్న తల్లులకు తెలియజేస్తూ ప్రతి ఒక్క నెలలు మహిళలు ఆచరించేటట్లుగా చేయవలెనని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కాంతకుమారి ఏసిటిపిఓ మాణిక్యరావు, ఈవో ఆదిలక్ష్మి, అరుణ మరియు సూపర్వైజర్స్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# న్యూట్రీ గార్డెన్ల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ తయారు చేయండి : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావు పేట, పెన్ పవర్ ఏప్రిల్ 23: జిల్లాలో పెద్ద ఎత్తున న్యూట్రి గార్డెన్ల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం న్యూట్రీ గార్డెన్ల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఒ సామూహిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో న్యూట్రి గార్డెన్ లు అభివృద్ధి చేయాలన్నారు. ఈ నెలాఖరు నాటికి న్యూట్రి గార్డెన్ ల కోసం నేల తయారీ పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల మొదటి బుధవారం జిల్లా వ్యాప్తంగా న్యూట్రి గార్డెన్ లను ప్రారంభించాలన్నారు. అదే రోజు స్వయం సేవా సంఘాల మహిళలతో కిచెన్ గార్డెన్లు, పట్టణ ప్రాంతాల్లో మిద్దె తోటల కోసం విత్తన పంపిణీ చేపట్టాలన్నారు. మండలానికి ఒకటి చొప్పున కమ్యూనిటీ న్యూట్రీ గార్డెన్ లను అభివృద్ధి చేయాలన్నారు. న్యూట్రీ గార్డెన్ లను లాభసాటి వ్యాపారంలా మలుచుకునేలా స్వయం సేవా సంఘాల మహిళలకు, కమ్యూనిటీ గార్డెన్ నిర్వాహకులకు శిక్షణ అందించాలన్నారు. అదే విధంగా కలెక్టరేట్ లో ప్రయోగాత్మకంగా న్యూట్రీ గార్డెన్ ను అభివృద్ధి చేసి సందర్శకులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవి, అమల కుమారి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, డీఎంహెచ్వో రవి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ నివారణకు హోమియో మందుల పంపిణీ



నందిగామ (ఎన్టిఆర్) : పెన్ పవర్, ఏప్రిల్, 23: నందిగామ పట్టణం గాంధీ సెంటర్‌లో గురువారం భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ కోసం ఏర్పాటు చేసిన ఉచిత హోమియో మందుల పంపిణీ శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య కూటమి నేతలతో కలిసి ప్రజలకు స్వయంగా హోమియో మందులను పంపిణీ చేశారు. పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. సేవా సంస్థలు వేసవి కాలంలో ప్రజల ఆరోగ్య భద్రత కోసం ముందుకు రావడం అభినందనీయమని, ప్రభుత్వం కూడా వడదెబ్బ నివారణ చర్యలను మరింత బలోపేతం చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని హోమియో మందులను పొందారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, సత్య సాయి సేవా సమితి సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరం జిల్లాపై ప్లాన్..

**విజయనగరం, ఏప్రిల్ 23, పెన్ పవర్:** : ఏపీలో మరోసారి అధికారంలోకి వస్తామని భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అధికార కూటమికి గట్టి సవాల్ విసురుతూనే ఉంది. దానికి కారణం బలమైన జిల్లాలు ఆ పార్టీ నేతలకు పట్టుకొమ్మలుగా నిలుస్తూ వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో ఆ జిల్లాల్లో ఏకపక్షంగా సీట్లు గెలవడం ద్వారా అధికారంలోకి రావచ్చు అనేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన. అయితే దానికి విరుగుడు సీఎం చంద్రబాబుతో పాటు లోకేష్ కనిపెట్టారు. ఎక్కడెక్కడ అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉందో ఆ జిల్లాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఏదో దూకుడుగా రాజకీయాలు చేయడం కాదు.. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును అమాంతం పెంచాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. మొన్నటి టిడిపి కార్యవర్గాల ప్రకటన వెనుక ఈ వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయనగరం లాంటి జిల్లాల విషయంలో చంద్రబాబు ఆలోచన ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. పక్కా ప్రణాళిక అన్నట్టు పరిస్థితి ఉంది. గత కొంతకాలంగా విజయనగరం జిల్లాను గమనిస్తున్న లోకేష్ మార్కు కనిపిస్తోంది ఈ కూర్పులో.కుల రాజకీయాలను అడ్డం పెట్టుకుని బొత్స రాణించారు విజయనగరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీతో పాటు వైసీపీలో తనకంటూ ఒక క్రియాశీలక పాత్ర పోషించి జిల్లాను శాసించారు. తన కుటుంబాన్ని మోహరించి జిల్లాను గుత్తాధిపత్యం లో ఉంచుకున్నారు. వ్యవస్థల్లో సైతం తన మనుషులను ఏర్పాటు చేసుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న.. ఏ ప్రభుత్వం ఉన్నా తన మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకున్నారు. అయితే దీనిని గ్రహించారు చంద్రబాబు. కానీ అశోక్ గజపతిరాజు లాంటి సౌమ్యుడుతో రాజకీయాలు చేసి బొత్సకు చెక్ పెట్టారు కానీ.. ఆయన మూలాలను దెబ్బతీయ లేక పోయారు. అయితే ఇప్పుడు అశోక్ గజపతి రాజును గవర్నర్ లాంటి రాజ్యాంగబద్ధ పదవిలోకి పంపించి.. ఆయనను ఎంతగానో గౌరవం ఇచ్చారు. కుమార్తె అదితి గజపతిరాజుకు ఎమ్మెల్యే పదవి ఇచ్చి రాజకీయ లోటును కూడా తీర్చారు. ఇప్పుడు బొత్స పై అసలు సిసలు రాజకీయం మొదలుపెట్టారు చంద్రబాబు, నారా లోకేష్.మొన్నటి ఎన్నికల్లో క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్నారు అశోక్ గజపతిరాజు. గత నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ జిల్లా బాధ్యతలను ఆయనే చూసేవారు. అయితే జిల్లా కోసం తన సొంత ఆస్తులను సైతం వదులుకున్నారు. అయినా సరే అక్కడ కుల సమీకరణలతో బొత్స తన ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. సంప్రదాయ రాజకీయాన్ని నమ్ముకున్న అశోక్ గజపతిరాజు అదే రీతిలో ముందుకు సాగారు. కానీ జిల్లాలో ప్రాబల్య సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బొత్స మాత్రం క్షేత్రస్థాయిలో తన పట్టును పెంచుకున్నారు. ఎప్పుడైతే అశోక్ గజపతిరాజు పక్కకు వెళ్లారో .. అప్పటినుంచి చంద్రబాబు మార్పు రాజకీయం ప్రారంభం అయింది. ముల్లును ముల్లుతోనే తీయాలి అన్న కోణంలో బొత్సకు అదే సామాజిక వర్గంతో చెక్ పెట్టడం ప్రారంభించారు. తూర్పు కాపు సామాజిక వర్గానికి ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. పార్టీ కార్యవర్గాలలో తూర్పు కాపుల ప్రాతినిధ్యం పెంచారు. బొత్సకు ధీటుగా ఒక సైన్యాన్ని తయారు చేసే పనిలో పడ్డారు.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే యువనేత కిమిడి నాగార్జునను పిలిపించుకున్నారు చంద్రబాబు, లోకేష్. బొత్స హవా కు బ్రేక్ వేయాలంటే దూకుడుగా వ్యవహరించాల్సిందేనంటూ తేల్చి చెప్పారు. అది మొదలు నాగార్జున గట్టిగానే బొత్స అండ్ కోకు సమాధానాలు చెబుతున్నారు. మరోవైపు యువనేత కొండపల్లి శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇచ్చారు. మరింత దూకుడు పెంచాలని ఆదేశించారు. తాజాగా తెలుగుదేశంలో విధానపరమైన నిర్ణయాల్లో అత్యున్నతంగా భావించే పొలిట్ బ్యూరోలో తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన గంటెడ శ్రీదేవికి చాన్స్ ఇచ్చారు. మరోవైపు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ను ప్రయోగిస్తున్నారు. కళా వెంకట్రావు సీనియర్ రెడ్డిని ఉపయోగించుకుంటున్నారు. ఆయన కుమారుడు రామ్ మల్లిక్ నాయుడును సైతం రంగంలోకి దింపారు. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే మాత్రం బొత్స ఫ్యామిలీకి దీటుగా ఒక సైన్యాన్ని తయారు చేస్తున్నారు చంద్రబాబు, లోకేష్. అయితే వీరి ధాటికి బొత్స ఫ్యామిలీ తోక ముడియక తప్పదు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పిఠాపురం ఎపిసోడ్ లో కొత్త ట్విస్టులు

# రంగంలోకి దొరబాబు..

**కాకినాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** ఏపీలో కూటమిలో భాగంగా పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన నేతగా పేరు తెచ్చుకున్న ఆయన..అప్పుడప్పుడు న్యూస్ ఇంట్రెస్టింగ్ సీన్స్‌కు తెరలేపుతున్నారట. జనసేనాని కోసం టికెట్ వదులుకోవడం వల్ల ఆయనకు ఓ రేంజ్‌లో ఎలివేషన్ వచ్చినా..ఆ తర్వాత పొలిటికల్ మైలేజ్ మాత్రం జీరో అన్నట్లు అయిపోందట. ఎమ్మెల్సీ అని..నామినేటెడ్ పోస్ట్ అని.. ఇలా ఎన్నో లీక్స్ వచ్చినా..ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో అప్పుడప్పుడు ఆయనలోని అసంతృప్తిని క్యామియో రోల్‌లో చూపిస్తున్నారట.నిజానికి వర్మకు ఎలాంటి ప్రోటోకాల్ లేదు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారు. అక్కడే ఏదో ఒక టాపిక్‌ను ఎత్తుకుని..ఇదేం పద్దతి అంటూ అధికారులపై ఫైర్ అవుతున్నారు. ఇప్పటికే ఓసారి ఫ్లెక్సీలో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని అధికారులపై ఆయన సీరియస్ అవడం పొలిటికల్ హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు.అయితే ఇప్పటికి రెండుసార్లు సీఎం చంద్రబాబు ఫోటో కోసమే వర్మ గళం వినిపిస్తున్నట్లు పైకి ప్రచారం జరుగుతున్నా ఆయన మాటల వెనుక మర్మమేంటన్నది ఎవరికి అంతుచిక్కట్లేదట. సీటు త్యాగం చేసినా..తనకు ఏ పదవి రాలేదనే ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న వర్మ..తన అసంతృప్తిని మరో రూపంలో బయటపెడుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కక్కలేక మింగలేక అన్నట్లుగా తన ఆవేదనను నిరసనగా మార్చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది.ఇక వర్మ బాధ ఒకటి అయితే..జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కథ మరోలా ఉందట. 2004లోనే ఆయన ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే. ఆ తర్వాత 2019లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో జగన్ దగ్గర ఆయన మాట బాగా చెల్లుబాటయ్యేదన్న టాక్ ఉంది. ఆ తర్వాత 2019లో వంగా గీతకు వైసీపీకి టికెట్ ఇవ్వగా.. ఆమె గెలుపు కోసం పనిచేసినా విజయం దక్కలేదు. 2024 ఆగస్టులో పెండెం దొరబాబు జనసేనలో చేరిపోయారు. ఆయన కూడా టూ టైమ్స్ ఎమ్మెల్యే, పైగా సీనియర్ లీడర్..ఈ నేపథ్యంలో తనకు కూడా ఏ పదవి లేకపోవడం ఆయన మదిని తొలిచేస్తుందట. అందుకే వర్మకేనా ఎలివేషన్..పిఠాపురంలో తాను కూడా ఉన్నానంటూ ఇది దొరబాబు సవాల్ అంటూ రెచ్చిపోతున్నారట. ఈ క్రమంలోనే ఏకంగా వర్మను టార్గెట్ చేసి పవన్ మదిలో చోటు కోసం ఆరాట పడుతున్నారటదొరబాబు పిఠాపురంలో వైసీపీ కోవర్టు అని వర్మ అంటుంటే..వర్మ చీకటి బాగోతాలు అంటూ దొరబాబు రచ్చకు తెరలేపారట. అయితే ఈ ఇద్దరిది సీరియస్ ఫైట్ కాదని..ఏదో ఒక బెర్త్ కోసమే రచ్చ చేస్తున్నారని పిఠాపురం పబ్లిక్‌లో చర్చ జరుగుతోందట. వర్మ త్యాగానికి ఏదో ఒక పదవి దక్కితే బాగుండనే చర్చ అందరిలో ఉన్నా..దొరబాబు ఎపిసోడ్‌పై జనంలో డిఫరెంట్ ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయట.రాజకీయ నాయకులు ఏదీ డైరెక్ట్ గా చెప్పరు. తన మీద ఒక్క అవినీతి అక్రమాల ఆరోపణలు రుజువు చేసినా రాజకీయ సన్యాసం స్వీకరిస్తాను అని దొరబాబు మీడియా ఎదుట సవాల్ చేశారు. తన మీద ఆరోపణలు చేసిన వారు నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. పిఠాపురంలో ఒక్క విషయంలో కూడా తాను అవినీతి చేయలేందని ఆయన అన్నారు. తనది మచ్చ లేని జీవితం అన్నారు. తాను నిజానికి రాజకీయాల నుంచి తప్పుకోవాలనే అనుకున్నానని అయితే పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో జనసేనలో చేరాను అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనను మంచి మెజారిటీతో గెలిపిస్తామని ఆయన చెప్పారు. అంతే కాదు వర్మ అండ్ కో చేస్తున్న ఆరోపణల మీద తాను పూర్తి వివరణ ఇస్తాను అని అదే విధంగా వారి విషయంలో కూడా పూర్తి గుట్టు విప్పుతాను అని స్పష్టం చేశారు. అయితే ఒకే పార్టీలో ఉంటూ ఒకరి గుట్టు మరొకరు విప్పుకుంటామని చెప్పడంతో కూటమిలో అలజడి రేగుతోంది. వర్మ అయితే దొరబాబు స్కాములను బయట పెడతామని అంటున్నారు. ఆయనకు జనసేనతో సంబంధం లేదని కేవలం తాను చేసిన అవినీతిని కప్పుపుచ్చుకోవడానికే ఆ పార్టీలో చేరారు అని వర్మ విమర్శించారు. అదే విధంగా వర్మ గుట్టు తన దగ్గర ఉందని దొరబాబు అంటున్నారు. ఇలా ఇద్దరూ మీడియాకు ఎక్కడంతో పార్టీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. ఈ విధంగా కీలక నేతలు మాజీ ఎమ్మెల్యేలు వీధిన పడితే పోయేది కూటమి పరువే అని అంటున్నారు.పొలిటికల్ లీడర్ల మాటల వెనుక మర్మం వేరులే అన్న ఒపీనియన్ ఉండనే ఉంది. ఇప్పుడు ఈ ఇద్దరి నేతల విమర్శలు, ప్రతి విమర్శల వెనుక పకడ్బందీ స్కెచ్ ఉందట. బాబు మదిలో చోటును పదిలం చేసుకునే ప్రయత్నంలో వర్మ..జనసేనాని మెప్పుకోసం దొరబాబు..రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నారట. ఇలా ఆ ఇద్దరి అసంతృప్తికి, ఆవేదనకు కారణం వేరైనా..కంటెంట్ మాత్రం బాగుందన్న డిస్కషన్ నడుస్తోంది.

# పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తు మేర నిర్మించేందుకు సమ్మతి తెలిపింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) తొలిసారిగా స్పష్టమైన ప్రకటన చేసింది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు గత నెల 25న ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు పీపీఏ వెబ్ సైట్ లో పోలవరం ఎత్తు కేవలం 41.15 మీటర్లుగానే చూపేవారు. 115 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు ఆ వెబ్ సైట్ లో ఉండేది అయితే తాజాగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెబ్ సైట్ లో ప్రాజెక్టు వివరాల్లో పూర్తిగా మార్పులు చేశారు. ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లుగా చూపడమే కాకుండా, గరిష్ట నిల్వ 194.60 టీఎంసీలుగా పేర్కొన్నారు. దీంతో పోలవరం ప్రాజెక్టు రెండో దశ చేపట్టేందుకు కేంద్రం సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం 41.15 మీటర్ల ఎత్తు ఉన్న ప్రాజెక్టును 45.72 మీటర్లకు పెంచాలంటే కేంద్రం తరఫున పలు కార్యక్రమాలు చేయాల్సివుంటుందని చెబుతున్నారు. కేంద్ర అటవీ పర్యావరణ అనుమతులు, స్టాప్ వర్క్ ఆర్డర్ ఎత్తివేత వంటి చర్యలు తీసుకోవాల్సివుంటుందని చెబుతున్నారు. గరిష్ట కాంటూరు 45.72 మీటర్లు ఎత్తు పెంచితే ప్రాజెక్టు రూపురేఖలు మారిపోనున్నాయని అంటున్నారు. ప్రస్తుతం పోలవరం మొదటి దశ పనులు చివరికి చేరుకున్నాయని అంటున్నారు. వచ్చే ఏడాది జూన్ లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ముందుగానే ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో కేంద్రం రెండో దశ పనుల విస్తరణపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. కాగా, 45.72 మీటర్ల ఎత్తుతో 194.6 టీఎంసీల చొప్పున రెండు దఫాలుగా నీటిని నిల్వ చేసుకోవచ్చునని అంటున్నారు. అంటే ప్రాజెక్టు ద్వారా మొత్తం 389.2 టీఎంసీల నీరు రాష్ట్ర అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.గరిష్ట కాంటూరు కూడా పూర్తయితే గోదావరి డెల్టాలో మొత్తం 10.13 లక్షల ఎకరాలు, 13 లక్షల కృష్ణా డెల్టాకు పుష్కలంగా సాగునీరు అందుతుందని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా కృష్ణా బేసిన్ లో 80 టీఎంసీలు నీటిని సరఫరా చేస్తారని, ఇందులో 23.44 టీఎంసీలు పారిశ్రామిక అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడతాయని చెబుతున్నారు. అదేవిధంగా మొత్తం 28.5 లక్షల మందికి సాగునీటి సమస్య తీరుతుందని, 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని చెబుతున్నారు. ఇక పోలవరం ప్రాజెక్టు రెండో దశకు ప్రభుత్వం సిద్ధమైతే భూ సేకరణకు భారీగా వెచ్చించాల్సివుంటుందని అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన కట్టడాల్లో ఎలాంటి మార్పు ఉండదని, కానీ, నిర్వాసితులకు పరిహారం, సహాయ పునరావాసాల కోసం రూ.28,561 కోట్లు అవసరం అవుతాయని లెక్క గడుతున్నారు. రెండో దశకు 80 వేల ఎకరాలు సేకరించాల్సివుంటుందని, మొత్తం 8 రెవెన్యూ మండలాల్లో 222 రెవెన్యూ గ్రామాలు ముంపునకు గురవుతాయని చెబుతున్నారు.

# ఏపీ బీజేపీని లైట్ తీసుకుంటున్న అధిష్టానం ఆశలొద్దు.. పనిచేయండి

**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:**
బీజేపీ ఏపీ నేతలకు ఇక పదవులు దక్కే అవకాశం లేదని పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ బీజేపీలో పదవుల కోసం ఆశావహులు చాలా మంది ఉన్నారు. కానీ ఇప్పటి వరకూ కూటమిలో ఉండటంతో వచ్చిన అవకాశాలను ఈ రాష్ట్ర నాయకులతోనే పదవులతో భర్తీ చేస్తుంది. కంభంపాటి హరిబాబుకు గవర్నర్ పదవి వచ్చింది. శ్రీనివాస వర్మకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. రాష్ట్ర మంత్రివర్గంలో సత్యకుమార్ యాదవ్ ఉన్నారు. ఎమ్మెల్సీగా సోము వీర్రాజును ఎంపిక చేశారు. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా నర్సాపురం నేత వెంకట సత్యనారాయణను ఎంపిక చేసి అందరినీ ఆశ్చర్యంలోముంచెత్తించారు.ఇక రానున్న ఏ పదవుల్లోనూ బీజేపీ రాష్ట్ర నేతలకు అవకాశాలు లేవని చెబుతున్నారు. ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అయినా దానిపై పెద్దగా కేంద్ర నాయకత్వం ఆసక్తి చూపడం లేదు. ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవి కోసం విష్ణు వర్ధన్ రెడ్డితో పాటు పలువురు నేతలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. అయితే వచ్చే జూన్ నెలలో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానం బీజేపీకి లభించనుంది. అందులో తమిళనాడు నేత అన్నామలైకు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించినట్లు పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అన్నామలైను పెద్దల సభకు ఏపీ నుంచి పంపాలని యోచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లో ఎంత మొత్తుకున్నా ఇక పార్టీ ఎదిగే పరిస్థితి లేదు. అయినా ఏపీ వల్ల రాజకీయంగా తమకు




కలిగే నష్టం ప్రత్యేకంగా ఏమీ లేదన్న అభిప్రాయంలో కేంద్ర నాయకత్వం ఉన్నట్లు తెలిసింది. టీడీపీతో ఎటూ బీజేపీ పొత్తులో ఉంటుంది. ఒకవేళ వైసీపీ వచ్చినప్పటికీ తమకు కేంద్రంలో మద్దతు లభిస్తుంది. అందువల్ల మిగిలిన రాష్ట్రాల్లో బలం పెంచుకునే ప్రయత్నంలో కేంద్ర నాయకత్వం ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇకపై పదవులను రాష్ట్ర నేతలను కాకుండా ఇతర ప్రాంత నేతలకు ఇచ్చే అవకాశాలున్నాయన్నది పార్టీ అత్యున్నత స్థాయి వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రాజ్యసభ సభ్యుడిగా తెలంగాణకు చెందిన ఆర్. కృష్ణయ్యకు ఇచ్చారు. ఇప్పుడు మరోసారి తమిళనాడుకు చెందిన అన్నామలైకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరి ఏపీ బీజేపీ నేతలకు ఇది షాకింగ్ వార్త అనే చెప్పాలి.

# టీడీపీ, జనసేనల మౌనం ఎందుకో...

**విజయవాడ, ఏప్రిల్ 23, (పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో కూటమి పార్టీల మధ్య ఎక్కడా సఖ్యత కనిపించడం లేదు. ఇది నిజంగా పార్టీ నాయకత్వానికి తెలిసీ మౌనంగా ఉంటుందా? లేకపోతే ఎన్నికల నాటికి సర్దుకుంటాయని భావిస్తుందో తెలియదు కాని రోజురోజుకూ మూడు పార్టీల మధ్య విభేదాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. నేతల మధ్య సమన్వయం చేసే వారు లేరు. పార్టీ క్రమశిక్షణ కమిటీలు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో కూటమి నేతల పోరాటాలు వీధిపోరాటాలుగా మారాయి. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే పిఠాపురం నియోజకవర్గంలోనే టీడీపీ, జనసేన నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. రెండు పార్టీలూ కలవలేనంతగా విడిపోయాయి.రాష్ట్ర స్థాయిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల మధ్య మంచి అవగాహన ఉంది. ఇరువురూ ఒకరినొకరు సంప్రదించుకుంటూ ఎవరినీ నొప్పించకుండా నిర్ణయం తీసుకుంటున్నారు. కానీ పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా ఎన్నికయిన పిఠాపురం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నకు మాత్రం ఎవరి వద్దా సమాధానం దొరకడం లేదు. ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో పెట్టకపోవడంపై మాజీ ఎమ్మెల్యే వర్మ మండిపడ్డారు. అధికారులపై ఆయన ఫైర్ అయ్యారు. జనసేన ఇన్ ఛార్జి పెండెం దొరబాబుతోనే ఒక్క పవన్ కల్యాణ్ ఫొటో మాత్రమే ఉంచడమేంటని ప్రశ్నించారు. మట్టి తోలుకునే వాడు వచ్చి ఇప్పుడు చెరువులు తవ్వేందుకు



ప్రయత్నిస్తున్నాడని వర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము ఇక్కడ పుట్టి పెరగామని, దత్తతకు రాలేదని అనడంతో జనసేన నేతలు మండిపడ్డారుఇటు టీడీపీ కాని, అటు జనసేన కానీ తమ పార్టీ నేతలను సముదాయించే ప్రయత్నాలు చేయకపోవడం, సంధి కుదర్చకపోవడం చూస్తుంటే ఏదో జరుగుతుందన్న అనుమానాలు కలుగుతున్నాయి. పిఠాపురంలోనే తాను మరోసారి పోటీ చేయాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అదే సమయంలో కూటమి పదిహేనేళ్ల పాటు కలసి ఉంటుందని చెబుతున్నప్పటికీ స్థానిక నాయకత్వాన్నిపిలిచి మాట్లాడలేకపోతున్నారు. మరొకవైపు చంద్రబాబు కూడా వర్మ అండ్ కోను కంట్రోల్ లో పెట్టకపోవడం చూస్తుంటే ఈ విభేదాలు ఇలాగే సాగిపోనీ.. తమకు వీరివల్ల నష్టం ఏమీ ఉండదన్న భరోసాలో ఉన్నట్లుంది. మొత్తం మీద పిఠాపురం నియోజకవర్గం వ్యవహారం మాత్రం పార్టీ నేతలకు ఎలా ఉన్నా... కూటమి అభిమానులకు మాత్రం కలవర పెడుతున్నాయి.


# వైసీపీలోకి వెంకట్రామిరెడ్డి..

**విజయవాడ, ఏప్రిల్ 23,పెన్ పవర్:**
ఏపీలో ఒక విచిత్ర వాతావరణం నడిచింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించారు. కానీ చాలామంది చదువుకున్న వారు, ఉద్యోగాలు చేస్తున్నవారు ముందుగా జగన్మోహన్ రెడ్డికి మద్దతు చెబుతుంటారు. అయితే అది వారి వ్యక్తిగతం కానీ కొందరు ఉద్యోగులు బాహటంగానే నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలు చేస్తుంటారు. అటువంటి వారికి ఉద్యోగ సంఘం మాజీ నేత వెంకట్రామిరెడ్డి ఎపిసోడ్ చక్కటి ఉదాహరణ. ఆయనకి ఇంకా 15 సంవత్సరాల సర్వీస్ ఉంది. మంచి ఉద్యోగ జీవితం ఉండేది. కానీ దానిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పణంగా పెట్టారు వెంకట్రామిరెడ్డి. జగన్మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేయాలన్న కోణంలో ఉద్యోగ సంఘం నేత ముసుగులో ఆయన చేయని ప్రయత్నం లేదు. ఉద్యోగ నిబంధనల ప్రకారం ఆయన పై వేటు వేసింది కూటమి ప్రభుత్వం. ఉద్యోగిగా డిస్మిస్ అయిన ఆయనకు ప్రభుత్వం నుంచి ఎటువంటి బెనిఫిట్స్ దక్కవు. అయితే ఆయనకు జగన్మోహన్ రెడ్డి ఏ రూపంలో సాయం చేస్తారు అనేది ఇప్పుడు ప్రశ్న.గతంలో చాలామంది ఉద్యోగులతో పాటు అధికారులకు పదవులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి వారు తమ ఉద్యోగాలకు స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన తర్వాత పార్టీలోకి రప్పించి ఎంపీ తో పాటు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. గెలిపించి చట్టసభలకు పంపించారు. ఇప్పుడు వెంకట్రామిరెడ్డి ని కూడా అలానే పొలిటికల్ గా ప్రోత్సహిస్తారా లేదా అనేది చూడాలి. కూటమి ప్రభుత్వం వెంకట్రామిరెడ్డి పై వేటు వేసినప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి విపరీతమైన సానుభూతి వచ్చింది. నేతలు ఒక్కొక్కరు ఆయనకు సంఘీభావం చెబుతూ ట్వీట్లు పెట్టారు. పొన్నవోలు సుధాకర్ రెడ్డి లాంటి వారు అయితే వెంకట్రామిరెడ్డి కోసం న్యాయపోరాటం చేస్తామని చెప్పుకొచ్చారు. అయితే న్యాయపోరాటానికి ఏళ్ల సమయం పడుతుంది. అదే పిలిచి వైసీపీలో ఏదో ఒక పదవి ఇస్తే ఆయన ఖుషి అవుతారు.

గతానికి మించి పార్టీ కోసం పని చేస్తారు.ఒక విధంగా చెప్పాలంటే వెంకట్రామిరెడ్డికి కూటమి ప్రభుత్వం పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చింది. ఆయనకు స్వతంత్రత లభించింది. ఎందుకంటే ఉద్యోగ సంఘాల నేత ముసుగులో వైసీపీ కోసం ఆయన పని చేశారు. ఇప్పుడు నిజంగా వైసీపీలో తీసుకొని కీలక బాధ్యతలు కట్టబెడితే రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తారు. జగన్మోహన్ రెడ్డి నిర్ణయమే ఫైనల్. త్వరలో వెంకట్రామిరెడ్డికి వైసీపీలోకి రప్పించి కీలక పదవి కట్టబెట్టే ప్రయత్నాలు ఉన్నట్లు చర్చ నడుస్తోంది. మరి అందులో వాస్తవం ఎంత ఉందో చూడాలి.

# సన్‌రైజర్స్‌లోకి ప్యాట్ కమిన్స్.. కెప్టెన్సీ మార్పుపై SRH కన్ఫ్యూజన్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ఎడిషన్ లో సన్‌రైజర్స్ హైదరా బాద్ అద్భుతంగా ఆడుతుంది. వరుసగా 3 విజయా లతో పాయింట్ల పట్టికలో దూసుకుపోతోంది. కానీ జట్టు విజయాలతో ముందుకు సాగుతున్న తరుణంలో కెప్టెన్సీకి సంబంధించి ఓ పెద్ద చర్చ స్టార్ట్ అయింది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ జట్టుతో చేరడంతో ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న ఇషాన్ కిషన్ నుంచి బాధ్యతలు తప్పుకునే ఛాన్స్ ఉందనేది.. అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ సీజన్ ఆరంభంలో ప్యాట్ కమిన్స్ గాయంతో అందుబాటులో లేకపోవడంతో జట్టు యాజమాన్యం అనూహ్యంగా యువ ప్లేయర్ ఇషాన్ కిషన్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. ఆరంభంలో కొన్ని ఓటములు ఎదురైనప్పటికీ.. ఇషాన్ తన నాయకత్వ పటిమతో జట్టుకి మళ్లీ విజయాలు అందించాడు. ముఖ్యంగా బౌలర్లను ఉపయోగించుకోవడంతో పాటు ఫీల్డింగ్ సెట్ చేయడంలో కిషన్ చూపిన పరిణతి చూస్తున్నాడు. ఇషాన్ కిషన్ కెప్టెన్సీని కొనసాగించాలని మాజీ క్రికెటర్లు గట్టిగా వాదిస్తున్నారు. హైదరాబాద్ జట్టు ప్యాట్ కమిన్స్ వైపు వెళ్లాలనే ఆలోచన చేయొద్దని సూచించారు. ప్రస్తుత సెటప్‌లో ఇషాన్ సారథ్యంలో జట్టు చాలా సమతుల్యంగా కనపడుతుంది. గత 5 మ్యాచ్‌ల్లో 4 గెలిచిన టీమ్ లో మార్పులు చేయడం అనవసరం అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. ప్యాట్ కమిన్స్ 2024లో జట్టును ఫైనల్‌కు చేర్చినప్పటికీ.. ప్రస్తుత ఫామ్ ఇషాన్‌కు అనుకూలంగా ఉందన్నాడు. మాజీ కోచ్ సంజయ్ బంగర్ కూడా ఇషాన్ కిషన్ కి సపోర్టు చేశాడు. ప్యాట్ కమిన్స్ వెన్నునొప్పి గాయంతో బాధపడుతున్నాడని.. దీనివల్ల అతను గత టీ20 ప్రపంచ కప్‌కు కూడా దూరంగా ఉన్నాడని గుర్తు చేశారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కమిన్స్.. ఐపీఎల్ లాంటి సుదీర్ఘ టోర్నీలో పూర్తిస్థాయిలో

ఫిట్‌గా ఉంటాడా అన్నది అనుమానమేనని సంజయ్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ గ్రౌండ్లో ఆటను నియంత్రించే తీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. హైదరాబాద్ జట్టు యాజమాన్యం ఇప్పుడు కన్ఫ్యూజన్ లో పడింది. ఓ వైపు ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం.. మరోవైపు వరుస విజయాలతో జోరు మీదున్న యంగ్ కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఎవరినీ కెప్టెన్సీగా ఉంచాలనే నిర్ణయంపై మదనపడుతుంది. మరి ఆరెంజ్ ఆర్మీ అనుభవానికి ఓటేస్తుందో లేక విజయం తెచ్చిపెడుతున్న యువ రక్తాన్ని నమ్ముతుందా అనేది వేచి చూడాలి.

# మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తా: వైభవ్ సూర్యవంశీ

**ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న యువ సంచలనం నిజాయతీ వ్యాఖ్యలు**

**వేగవంతమైన 500 పరుగుల ఘనతలో మ్యాక్స్‌వెల్ ను అధిగమించిన సూర్యవంశీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. నిన్న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 8 పరుగులే చేసినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో 500 పరుగులు పూర్తి చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

అంతేగాక ఎదుర్కొన్న బంతుల పరంగా వేగంగా ఈ మైలురాయిని చేరుకుని, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న రికార్డును కూడా వైభవ్ బద్దలుకొట్టాడు. ఈ ఘనత సాధించిన తర్వాత అతను పంచుకున్న విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ... "నా బుర్రలో పెద్దగా ఏమీ ఆలోచించను. ఇప్పటికీ ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తాను. అది నాకు అలవాటు. అయితే, ఆటపైనే పూర్తి ఫోకస్ ఉంటుంది" అని నవ్వుతూ చెప్పాడు. చిన్న వయసులోనే స్టార్‌డమ్ వచ్చినా, తనలోని చిన్నపిల్లల అలవాటును నిజాయతీగా చెప్పడంతో నెటిజన్లు అతనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

"తర్వాతి మ్యాచ్‌లో కచ్చితంగా బాగా ఆడతాను. ఈ విజయంతో రెండు పాయింట్లు సాధించాం. ప్లేఆఫ్స్ దిశగా ముందుకు వెళ్తాం" అని వైభవ్ ధీమా వ్యక్తం చేశాడు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో రాజకీయ ప్రకంపనలు.. ఇరాన్ స్థానంలో ఇటలీకి అవకాశం?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్ అయిన ఫిఫా వరల్డ్ కప్‌కు రాజకీయ వివాదాల సెగ తగిలింది. జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నమెంట్‌లో అర్హత సాధించిన ఇరాన్ జట్టును తప్పించి, దాని స్థానంలో ఇటలీని చేర్చాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి ఒకరు ఫిఫాకు సూచించినట్లు సంచలన వార్తలు వెలువడుతున్నాయి. పోప్ లియో ౧౪ం పై ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో చెలరేగిన రాజకీయ వివాదాన్ని చల్లార్చేందుకే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికా వలస విధానం, ఇరాన్‌తో యుద్ధం వంటి అంశాలపై పోప్ లియో ౧౪ం వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' మీడియా వేదికగా ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పోప్ నేరాలను అరికట్టడంలో బలహీనంగా ఉన్నారు. విదేశాంగ విధానంలో ఘోరంగా విఫలమయ్యారు" అని ట్రంప్ చేసిన పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా దుమారం రేపింది. ముఖ్యంగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఈ వ్యాఖ్యలను "ఆమోదయోగ్యం కాదు" అని తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామంతో ట్రంప్, మెలోనీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఈ వరల్డ్ కప్ ప్రతిపాదన ముందుకు వచ్చింది. ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి పాలో జంపొల్లి మాట్లాడుతూ.. "వరల్డ్ కప్‌లో ఇరాన్ స్థానంలో ఇటలీని చేర్చాలని నేను ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోలకు సూచించాను. నేను ఇటలీ సంతతికి చెందినవాడిని. అమెరికా ఆతిథ్యం ఇచ్చే టోర్నమెంట్‌లో అజూరీ (ఇటలీ జట్టు) ఆడటాన్ని చూడాలన్నది నా కల. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఇటలీకి ఆ అర్హత ఉంది" అని వివరించారు. విచిత్రమేమిటంటే వరుసగా మూడుసార్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో ఇటలీ విఫలమైంది. ప్లే-ఆఫ్‌లో బోస్నియా హెర్జెగోవినా చేతిలో ఓడిపోయి చరిత్రలో తొలిసారిగా ఇలాంటి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. మరోవైపు ఇరాన్ వరుసగా నాలుగోసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. అయితే, అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో తమ గ్రూప్ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు మార్చాలని మొదట ఫిఫాను కోరింది. ఆ తర్వాత దేశంపై జరుగుతున్న వైమానిక దాడుల కారణంగా టోర్నమెంట్‌లో పాల్గొనలేమని ఇరాన్ క్రీడా మంత్రి అహ్మద్ దొన్యమాలి అధికారికంగా ప్రకటించారు.

దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "ఇరాన్ జట్టుకు ప్రపంచకప్‌లోకి స్వాగతం. కానీ, వారి ప్రాణ భద్రత దృష్ట్యా వారు ఇక్కడ ఉండటం సబబు కాదని నేను భావిస్తున్నాను" అని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఇరాన్ తన తొలి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో సోఫై స్టేడియంలో ఆడాల్సి ఉంది. కానీ తాజా పరిణామాలతో అర్హత కోల్పోయిన ఇటలీకి అనూహ్యంగా తలుపులు తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**నేహా శర్మ చిక్ మరియు సొగసైన స్టైల్ స్టేట్‌మెంట్‌లో స్టన్స్**



# రౌడీ జనార్ధన కోసం భారీ యాక్షన్ సీక్వెన్స్!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ మాసీవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రౌడీ జనార్ధన-. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. కీర్తి సురేష్ తొలి సారి విజయ్‌కి జోడీగా నటిస్తుండటం, విజయ్ ఫస్ట్ టైమ్ పక్కా మాస్ క్యారెక్టర్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పలికే తూర్పు గోదావరి యాస ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ అంచనాల్ని పెంచేసింది. 80వ దశకంలో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇది. ఇందు కోసం డిఫరెంట్ మేకోవర్‌తో విజయ్ దేవరకొండ నటిస్తున్నాడు. టీజర్‌లో రౌడీ పాత్రలో విజయ్ సరికొత్తగా కనిపించిన తీరు అభిమానుల్ని, సినీ లవర్స్‌ని విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. రాయలసీమ ప్రాంతంలో జరిగిన ఓ పొలిటికల్ ఎమోషనల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు రవి కిరణ్ కోలా దీన్ని తెరకెక్కిస్తున్నాడు. విజయ్‌తో బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించాలనే పట్టుదలతో దిల్ రాజు ఈ మూవీని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మే చివర్లో రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ని ప్రారంభించి సాంగ్‌తో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. ఈ మూవీకి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ అత్యంత కీలకంగా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్. ఈ ఎపిసోడ్‌లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించి కేక పెట్టిస్తాడని తెలుస్తోంది. రౌడీలకే రౌడీగా విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమా కావడం, ఇందులో మునుపెన్నడూ లేనంతగా మాస్ క్యారెక్టర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తుండటంతో అభిమానులు, సినీ లవర్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శరవేగంగా షూటింగ్‌ని పూర్తి చేసి ఇదే ఏడాది డిసెంబర్‌లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్లో ఉంటూ తనదైన మార్కుని కోల్పోయిన విజయ్ దేవరకొండ ఈ మూవీతో స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని బలంగా కోరుకుంటున్నాడు. అందుకే ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సినిమా చేస్తున్నాడట. ఈ విషయాన్ని ఆ మధ్య విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌తో ఫుల్ క్లారిటీ ఇచ్చేయడంతో మళ్లీ రౌడీ రైజింగ్ అవ్వబోతున్నాడని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

**కృతి శెట్టి గ్రేస్ మరియు గ్లామర్ యొక్క విజన్**



*Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965*